
www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
21.09.2024
సంపుటి:2 సంచిక:326

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# హైదరాబాద్ లో భారీ వర్షం

- పలు చోట్ల ట్రాఫిక్ జామ్
- మరో మూడు రోజులు వానలు
- వాతావరణ శాఖ హెచ్చరిక

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
హైదరాబాద్ నగర వాసులకు ఎండల నుంచి ఉపశమనం అభించింది. హైదరాబాద్ లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు నుంచి 3 రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి అని అంచనా వేశారు.
ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి వాన పడుతోంది. రాత్రి వేళ సికింద్రాబాద్, బేగంపేట్, ఉప్పల్, రామంతాపూర్, కోఠి, అబిడ్స్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, నాంపల్లి, లక్డికాపుల్, సెక్రటేరియట్, మాదాపూర్, కొండాపూర్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, అమీర్ పేట, ఖైరతాబాద్ సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది.



# వడ్లకు రూ. 500 బోనస్
# హైడ్రాకు ఫుల్ పవర్స్

“సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం (సెప్టెంబర్ 20న) రోజున సచివాలయంలో నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ స్థలాలను అడ్డగోలుగా ఆక్రమించి.. అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలపై బుల్డోజర్లను ప్రయోగిస్తూ.. అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తోన్న హైడ్రాకు.. విస్తృత అధికారాలు ఇస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. హైడ్రాకు చట్టబద్ధత కల్పించే అంశంపై కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే.. హైడ్రా కోసం 169 మంది సిబ్బందిని కేటాయించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. రైతులకు వడ్లపై 500 రూపాయల బోనస్ ఇచ్చే అంశంపై కూడా చర్చించిన మంత్రి వర్గం.. సానుకూల నిర్ణయం తీసుకుంది. కాగా.. ఈ ఏడాది నుంచే రైతులకు సన్న వడ్లపై రూ.500 బోనస్ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

- మూడు యూనివర్సిటీల పేర్లు మార్పు
- కోటి మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు
- పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం పేరు
- టెక్స్ టైల్స్ అండ్ హ్యాండ్‌లూమ్స్ వర్సిటీకి కొండాలక్ష్మణ్ బాపూజీ పేరు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ఇదిలా ఉంటే.. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి పలు వేదికలపై ప్రకటించినట్టుగా.. మూడు యూనివర్సిటీల పేర్లు మార్చుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా.. కోటీ మహిళా విశ్వవిద్యాలయం పేరును చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాప్ రెడ్డి యూనివర్సిటీగా, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్‌లూమ్స్ యూనివర్సిటీకి కొండ లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇదే క్రమంలో ములుగు మెడికల్ కాలేజీకి 433 పోస్టుల మంజూరు చేయడంతో పాటు ఏటూరు నాగారంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఇక.. తెలుగు యూనివర్సిటీకి మాజీ ఎమ్మెల్యే సురవరం ప్రతాపరెడ్డి పేరును పెడుతూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈమేరకు.. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి.. మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

**హైడ్రా కూల్చివేతలు ఆగవు..**
**సీఎం రేవంత్ కీలక కామెంట్స్**

స్వాతంత్ర్యోద్యమంలో గోల్కొండ పత్రికతో ఉద్యమ స్ఫూర్తి, పోరాట జ్వాలలు రగిలించిన గొప్ప వ్యక్తి సురవరం ప్రతాప రెడ్డి అని చిన్నారెడ్డి కొనియాడారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలతో అనేక పుస్తకాలు రచించారని, తన రచనలతో సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారని తెలిపారు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన సురవరం.. వనపర్తి నుంచి తొలి ఎమ్మెల్యేగా 1952లో ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో పేరు ప్రఖ్యాతులు పొందిన సురవరం పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు.




# కాంగ్రెస్ వెనక తుక్డే తుక్డే గ్యాంగ్

- అర్బన్ నక్సలైట్లు కూడా..
- ఆ పార్టీలో దేశభక్తి తుడిచిపెట్టుకుపోయింది
- కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం
- తెలంగాణ రైతులను కాంగ్రెస్ ముంచింది
- వినాయకుడి విగ్రహాన్ని పోలీస్ జీపులో ఎక్కించారు
- ప్రధాని నరేంద్రమోడీ ఘాటు విమర్శలు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదని, ఆ పార్టీలో దేశభక్తి, స్ఫూర్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం, నిజాయతీ లేకపోవడం అని విమర్శించారు.తెలంగాణలో రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చి రైతుల నుంచి తప్పించుకొని తిరుగుతోందని మండిపడ్డారు. గణపతి ఉత్సవాలను కూడా ఆ పార్టీ వ్యతిరేకిస్తోందని మోదీ పునరుద్ఘాటించారు. “నేటి కాంగ్రెస్ గణపతి పూజను కూడా అసహ్యించుకుంటోంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ నాయకత్వంలో దేశ ఐక్యతను పెంచడానికి గణపతి ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలు కలిసి పాల్గొంటారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వినాయకుడి

..మిగతా 2 లో

# జానీ మాస్టర్ కు
# 14 రోజులు రిమాండ్



- చర్లపల్లి జైలుకు తరలింపు
- రహస్య ప్రదేశంలో విచారణ
- డ్యాన్స్ షోకు వచ్చిన అమ్మాయి మీద లైంగిక దాడి
- ఫిర్యాదుతో పోక్సో కేసు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను నార్సింగి పోలీసులు ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో జానీ మాస్టర్‌ను శుక్రవారం తెల్లవారుజామున గోవా నుంచి హైదరాబాద్ తీసుకొచ్చి రహస్య ప్రదేశంలో విచారించారు. పలు కీలక అంశాలపై ఆరా తీశారు. హైదర్‌గూడలోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ఆయన్ను హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించనున్నారు. జానీ మాస్టర్‌పై పోక్సో యాక్ట్ నమోదు చేయడంతో ఆయన

..మిగతా 2 లో



# అది ఫ్యూచర్ సిటీ కాదు..
# ఫోర్ బ్రదర్స్ సిటీ

- వేల ఎకరాలు గుంజుకొనేందుకు ప్లాన్
- కుందారం భూములపై అరాచక కాండ
- ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చారు
- 400 ఎకరాలు కబ్జా చేయడం కోసం స్కెచ్
- నయీం అనుచరులను రంగంలోకి దించారు
- రైతులను బెదిరిస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

..మిగతా 2 లో



# సోరెన్ ప్రభుత్వం అవినీతిమయం

- జార్ఖాండ్‌లో అధికారంలోకి
- ఒక్క చొరబాటుదారుని కూడా ఉపేక్షించం
- ప్రతి ఏడాది ఐదు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం
- కేంద్ర హోం అమిత్‌షా

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**
హేమంత్ సోరెన్ ప్రభుత్వం అవినీతిమయమని కేంద్ర హోం అమిత్‌షా అన్నారు. రైతులకు దన్నుగా నిలచి, ఉద్యోగావకాశాలను కల్పించే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలని

..మిగతా 2 లో

# లడ్డూలో జంతువుల కొవ్వు నిజమే

- కల్తీ నెయ్యిని వాడారు
- త్వరలో అధునాతన ల్యాబ్ ఏర్పాటు చేస్తాం
- లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయి
- టీటీడీ ఈవో శ్యామలా రావు
- కల్తీ నెయ్యి వాడి ప్రజల మనోభావాలు దెబ్బతీశారు
- ఏపీ సీఎం చంద్రబాబు
- లడ్డూలో జంతువుల కొవ్వును వినియోగించడం నీచం
- కేంద్రమంత్రి బండి సంజయ్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తిరుమలలో లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని, జంతువుల కొవ్వు వాడారని ఏపీ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై వైసీపీ నేతలు, టీటీడీ మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్ రెడ్డి, వైసీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిలు ఘాటుగా స్పందించారు. తిరుమలలో ఎలాంటి అపచారం జరగలేదని, నెయ్యి, ప్రసాదాలలో ఎలాంటి కల్తీ జరగలేదన్నారు. అయితే నెయ్యి కల్తీపై టీటీడీ ఈవో శ్యామలరావు శుక్రవారం నాడు స్పందించారు. గతంలో నెయ్యి సరఫరాపై, నాణ్యతపై ఎలాంటి పరీక్షలు జరగలేదన్నారు. అయితే జూలై 6, 12 వ తేదీన నెయ్యి శాంపిల్స్ ని టెస్టింగ్ కీ ల్యాబ్ కీ పంపగా.. జంతువుల కొవ్వు కలిసిందని,

..మిగతా 2 లో

# సింగరేణి కార్మికులకు బోనస్

- రూ.796 కోట్ల పంపిణీ
- ఒక్కొక్క కార్మికుడికి లక్షా 90వేలు బోనస్
- కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేలు
- తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులది కీలక పాత్ర
- లాభాల్లో 33 శాతం ఇస్తున్నాం



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాను దసరా బోనస్ గా ప్రకటించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు శుభ వార్త అందించింది. రూ.4,701 కోట్ల రూపాయల ప్రాపర్టీ ట్యాక్స్ లో రూ.796 కోట్లను సింగరేణి కార్మికులకు పంచుతున్నాం. ఒక్కొక్క సింగరేణి కార్మికుడికి 1 లక్షా 90వేలు బోనస్ ఇస్తున్నాం. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇస్తాం. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వడం ఇదే మొదటి సారి. గత ఏడాది కంటే 20 వేలు అధికంగా బోనస్ ఇచ్చాం. సింగరేణి లాభాల్లో 33 శాతం వాటాను కార్మికులకు బోనస్ గా అందిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు

..మిగతా 2 లో



## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

**పశువులను గోశాలకు పంపించిన పోలీసులు**



**చిరుమామిడి, విశాల భారతి:** చిగురుమామిడి మండల పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో సుమారు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో చిగురుమామిడి ఎస్ఐ బండి రాజేష్ వాహన తనిఖీలు శుక్రవారం నిర్వహించగా హుస్నాబాద్ నుండి కరీంనగర్ వైపుగా వెళుతున్న బొలెరో వాహనాన్ని కంటైనర్ వాహనాన్ని సోదా చేయగా అందులో ఐదు ఎడ్లు, మూడు ఆవులు, రెండు దూడలు ఉన్నవని ఎస్ఐ తెలిపారు. వాహన డ్రైవర్ సాదిక్ ఖురేషి అనే వ్యక్తిని విచారించగా హుస్నాబాద్ అంగడిలో కొని హైదరాబాద్ తీసుకువెళ్లి అమ్ముకుంటామని డ్రైవర్ చెప్పాడని అన్నారు. అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించి గోషాలకు తరలించడం జరిగింది. వాహన డ్రైవర్ సాదిక్ ఖురేషి అలాగే వాహన ఓనర్ షాదీదులపై కేసు నమోదు చేయడం జరిగింది అని అన్నారు.



## మనూలో విద్యార్థుల ఆందోళన

**దుర్వాసన, నాణ్యత లేని ఆహారం వడ్డిస్తున్నారని ఆగ్రహం**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ఏమాత్రం నాణ్యత లేని,దుర్వాసన వచ్చే ఆహారాన్ని తమకు వడ్డిస్తున్నారని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్శిటీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గచ్చిబౌలిలోని యూనివర్సిటీలో ఆందోళనకు దిగారు.దాదాపు 400 మంది విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గత కొద్దిరోజులుగా విద్యార్థులకు సరియైన ఆహారాన్ని వడ్డిస్తలేరని, విద్యార్థులకు ఇచ్చే ఆహారంలో దుర్వాసన వస్తుందని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేశారు.ఇదే విషయంపై పలుమార్లు హాస్టల్, యూనివర్సిటీ యాజమాన్యానికి దృష్టి తీసుకెళ్లిన పట్టించుకోవట్లేదని ఆరోపించారు. గత రెండు రోజులుగా అధికారులు స్పందించకపోవడంతో నిరాహార దీక్షకు దిగినట్లు విద్యార్థులు తెలిపారు. అయితే యూనివర్సిటీ చీఫ్ ఈ సమస్యను వ్యక్తిగతంగా తీసుకొని యూనివర్శిటీలో జరిగే స్టూడెంట్ ఎలక్షన్ లను రద్దు చేశారన్నారు. స్టూడెంట్స్ యూనియన్ ఎలక్షన్ లను వెంటనే నిర్వహించాలని,తమకు ఇచ్చే ఆహారంలో నాణ్యత పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

## సోరెన్ ప్రభుత్వం అవినీతిమయం

**మొదటిపేజీ తరువాయి**

కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే జార్ఖండ్‌లో ఒక్క చొరబాటుదారుని కూడా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో 2024 ఎన్నికలకు సంబంధించిన బీజేపీ పరివర్తన ర్యాలీని హోం మంత్రి శుక్రవారంనాడు ప్రారంభించారు. ఇక్కడి నుంచి మొదలైన పరివర్తన యాత్ర రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి, ఇంటింటికి చేరుకుంటుందని చెప్పారు. జేఎంఎం, కాంగ్రెస్ స్థానంలో బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావడంతోనే మార్పు జరిగినట్టు కాదని, అవినీతి ప్రభుత్వాన్ని తొలగించి, అవినీతికి అడ్డుకట్ట వేసే ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. చొరబాటుదారుల చేతుల్లో గిరిజన యువతులు, సంస్కృతి తల్లడిల్లుతోందని అన్నారు. రైతులు, స్థానికంగా ఉపాధి కల్పించే ప్రభుత్వానికి మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు దన్నుగా నిలుస్తోందని, రైతుల ఆదాయం పెరిగేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజన యువతీ యువకులు ఉద్యోగం కోసం దేశంలోని వేరే ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

## సింగరేణి కార్మికులకు బోనస్

**మొదటిపేజీ తరువాయి**

సైతం తమ వంతు పాత్ర పోషించారు' అని వ్యాఖ్యానించారు.

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారు. సింగరేణి కార్మికులకు బోనస్ ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. దాంతో సింగరేణి కార్మికులకు దసరా బోనస్ ప్రకటిస్తున్నాం. దసరా కంటే ముందుగానే సింగరేణిలో లాభాల వాటా పంచడం ద్వారా కార్మికుల కుటుంబాల్లో ఆనందాన్ని చూడాలనుకున్నాం.

**ఏడాది సింగరేణి మొత్తం ఆదాయం రూ.4,701 కోట్లు**

సింగరేణి సంస్థ రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు ఇతర సంస్థలకు, ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎగుమతి చేస్తోంది. సింగరేణి కార్మికులు 202324 సంవత్సరంలో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం చేకూర్చారు. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించారు. మిగిలిన మొత్తం రూ.2,412 కోట్లు కాగా, ఇందులో నుంచి మూడో వంతు రూ.796 కోట్లను కార్మికులకు దసరా బోనస్‌గా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. సింగరేణిలో 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. గతేడాది సింగరేణి కార్మిలకు అందిన బోనస్ రూ.1.70 లక్షలు కాగా, ఈ ఏడాది ఒకొక్కరికి బోనస్ కింద రూ.1.90 లక్షలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాలను పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించారు. రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో టీఎస్ జెన్ కో ఆధ్వర్యంలో మరో 1x800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, జైపూర్‌లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 1x800 మెగావాట్ల సామర్థ్యంతో మరో కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పైన (పిట్ హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సంస్థ పరిధిలోని వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తామని, సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణతో పాటు హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. మని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

**వరద బాధితులను ఆదుకునేందుకు సింగరేణి భారీ సాయం**

వరద బాధితులను ఆదుకునేందుకు సింగరేణి ఉద్యోగులు పెద్ద మనసుతో ముందుకొచ్చారు. సింగరేణి కార్మికులు తమ ఒకరోజు వేతనం రూ.10.25 కోట్లను తెలంగాణ సీఎ సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాం, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌లు సెప్టెంబర్ 19న కలిసి అందజేశారు. దాంతోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం రూ.2.50 లక్షలను వరద బాధితుల కోసం విరాళం అందించారని తెలిసిందే.

# అది ఫ్యూచర్ సిటీ కాదు..

# ఫోర్ బ్రదర్స్ సిటీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఫ్యూచర్ సిటీ.. ఫోర్త్ సిటీ పేరిట రేవంత్ సర్కార్ పేదల భూములపై కన్నేసింది. ఫోర్త్ సిటీ మాటున వేల ఎకరాలు గుంజుకునేందుకు కసరత్తు మొదలుపెట్టింది కాంగ్రెస్ సర్కార్. అడ్డగోలు అలైన్‌మెంట్‌తో.. పేదల అనుమతి లేకుండా... వారి భూములను స్వాధీనం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి తీరుపై బాధిత గ్రామాల ప్రజలు, రైతులు కన్నెర్ర జేస్తున్నారు.

అయితే రంగారెడ్డి జిల్లా వెల్దండ, మాడ్గుల మండలాల్లోని కుందారం భూములపై అరాచకకాండ రాజ్యమేలుతున్నదని నమస్తే తెలంగాణ దినపత్రిక ఒక ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అది ఫోర్త్ సిటీ కాదు.. అది ఫోర్ బ్రదర్స్ సిటీ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ మాఫియా అనే హ్యాష్‌ట్యాగ్ జతపరిచారు కేటీఆర్.

మారిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తో లబ్ధి పొందేందుకు వీలుగా 400 ఎకరాలను చెరపట్టడమే లక్ష్యంగా దళారీ దందా సాగుతున్నది. ఓ కీలకనేత సోదరులు, సంబంధీకులూ వీరిలో ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 'భూములిస్తారా.. మేమే లాక్కోవాల్నా' అని రైతులను బెదిరించి ఇప్పటికే అడ్డికి పావుసేరుగా వంద ఎకరాలు కొనేశారు. 'కబ్జా స్వాధీనపత్రం' అంటూ ప్రపంచంలో ఎక్కడా లేని పత్రాలపై సంతకాలు చేయించుకుని ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. నయీం అనుచరులను దింపి మాట వినని రైతులను బెదిరిస్తున్నారు. అజలాపురం నుంచి కుందారం తండా దాక ఇదే భయానక వాతావరణం! కుందారం భూములపై కన్నేసిన 'బిగ్‌బ్రదర్స్' వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే ఒకవైపు ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో మార్పు చేశారు. దీంతోపాటు ఆమనగల్‌రావిర్యాల గ్రీన్‌ఫీల్డ్ 300 ఫీట్ల రహదారిని కూడా దీనికి సమీపంలోనే ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో మరోవైపు కొందరు వ్యక్తులను రంగంలోకి దించి పెద్దఎత్తున భూములను కొనుగోలు చేస్తున్నారు. ఇందులోనే నయీం అనుచరులు కీలకపాత్ర పోషిస్తున్నట్టు గ్రామస్తులు కొందరు తెలిపారు. ముఖ్యంగా ఓఆర్‌సీ, పాసు పుస్తకాలు లేకుండా కబ్జాలో ఉన్న రైతులను ముందుగా టార్గెట్ చేశారు. 'ఎలాగూ మీకు డాక్యుమెంట్లు లేవు... ఎంతోకొంతకు అమ్ముకుంటే ఇప్పుడు పైసలొస్తయి. లేదంటే భూమి నుంచి వెళ్లగొడ్తరు. మేం ఎలాగోలా సీసీఎల్ఏలో రికార్డుల్లో నమోదు చేసుకుంటాం' అని చెప్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

భూములియ్యబోమని మొండికేసినవారిని బెదిరిస్తున్నారు. వాస్తవానికి ఇక్కడ ఎకరా రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ధర పలుకుతుండగా... కేవలం రూ.34 లక్షలకే కొనుగోలు చేసుకొని, ప్రైవేటు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఆపై ఓఆర్‌సీ ఉండి, భూమిపై ఉన్న వారిని కూడా బెదిరిస్తున్నారు. రికార్డుల్లో తక్కువ ఉండి, కబ్జాలో ఎక్కువ ఉన్నందున మొత్తానికి ఒక రేటు నిర్ధారించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు వందెకరాలకు పైగా భూమిని ఇలా కొనుగోలు చేసినట్టు సమాచారం. అయితే ఓఆర్‌సీ ఉండి పాసు పుస్తకాలు లేకుండా, కబ్జా మీద లేనివారు ఇప్పుడు వీరిచుట్టూ తిరుగుతున్నారు. మాకు ఓఆర్‌సీ ఉంది.. పైసలు మాకియ్యాలి అంటూ వేడుకున్నా కనికరించడంలేదని కొందరు రైతులు 'నమస్తే తెలంగాణ'తో ఆవేదన వ్యక్తంచేశారు.

## జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ కు సన్మానం

**చిగురుమామిడి, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మారుతి ప్రకాష్‌ను టియుడబ్ల్యూజే (ఐజేయు) అనుబంధ జర్నలిస్ట్ హౌసింగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకం అయిన సందర్భంగా చిగురుమామిడి మండల టియుడబ్ల్యూజె (ఐజేయు)కన్వీనర్ పత్తేం రమేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ప్రకాశ్ ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. 25 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతూ అనేక పదవులను పొంది, జర్నలిస్టుల సమస్యల కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. రాబోయే రోజుల్లో అర్హులైన పాత్రికేయుల నివేషణ స్థలాల కోసం కృషి చేయాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో జిల్లా నాయకులు జేరిపోతుల వెంకటస్వామి,మండల పాత్రికేయులు బొల్లుమల్ల రాజమౌళి,జేరిపోతుల సదానందం,శేషం నరసింహచార్యులు,ముడికే కనకయ్య,ఎనగందుల అశోక్, బండారి అజయ్,భోజనపల్లి సాయి చరణ్,నాంపల్లి సురేష్,తదితరులు పాల్గొన్నారు.




## జానీ మాస్టర్ కు 14 రోజులు రిమాండ్

**మొదటిపేజీ తరువాయి**

తరఫు న్యాయవాది రంగారెడ్డి జిల్లా కోర్టులో బెయిల్ అప్లై చేయనున్నారు.

**ఇదీ జరిగింది**

మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ అమ్మాయి 2017లో ఓ డాన్స్ షోలో పాల్గొనగా.. ఆ షోకి జడ్జిగా జానీ మాస్టర్ ఉన్నారు. ఆమె ప్రతిభ చూసిన అనంతరం తన వద్ద డ్యాన్స్ అసిస్టెంట్‌గా అవకాశం ఇప్పిస్తానని జానీ హామీ ఇచ్చారు. అలా 2019 నుంచి ఆ యువతి ఆయన దగ్గర అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తోంది. ఈ క్రమంలో తనను లైంగిక వేధింపులకు గురి చేశాడని జానీ మాస్టర్‌పై యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను మైనర్‌గా ఉన్న సమయంలోనే హోటల్‌లో తనపై అత్యాచారం చేశారని యువతి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి అనంతరం నార్సింగి పీఎస్‌కు కేసు బదిలీ చేశారు. తాను మైనర్‌గా ఉన్న సమయంలోనే హోటల్‌లో తనపై జానీ అత్యాచారం చేశారని పోలీసులు ఫిర్యాదులో పేర్కొనగా.. పోక్సో యాక్ట్ సైతం జత చేశారు. ఆరోపణలు వచ్చిన అనంతరం జానీ మాస్టర్ పరారీలో ఉండగా.. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం గోవాలో ఆయన్ను అరెస్ట్ చేసింది. మరోవైపు, ఈ వ్యవహారం టాలీవుడ్ పరిశ్రమను కుదిపేస్తోంది. బాధితురాలికి పలువురు అండగా నిలిచారు.




## కాంగ్రెస్ వెనక తుక్డే తుక్డే గ్యాంగ్

**మొదటిపేజీ తరువాయి**

విగ్రహాన్ని పోలీసు జీపులో ఎక్కించి, అవమానించిన ఘటన మీ అందరికీ తెలుసు. ప్రజలు పూజించిన దేవుని విగ్రహాన్ని పోలీసు వ్యాన్‌లో బంధించారు. ఈ విషయంపై కాంగ్రెస్ మిత్రపక్షాలు కూడా మౌనంగా ఉండడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కాబట్టి మనమంతా ఏకమై కాంగ్రెస్ చేస్తున్న పాపాలకు తగిన బుద్ధి చెప్పాలి'' అని మోదీ అన్నారు.

నేటి కాంగ్రెస్‌లో దేశభక్తి స్ఫూర్తి చచ్చిపోయి, ద్వేషం అనే దెయ్యం ప్రవేశించిందని మోదీ దుయ్యబట్టారు. కర్ణాటక, తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల్లోకి నెట్టేస్తోందని అన్నారు. విదేశాలకు వెళ్లి దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ భరతమాతను, దేశ సంస్కృతిని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత అవినీతికరమైన కుటుంబం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ రాజకుటుంబమే అని ప్రధాని తీవ్రంగా మండిపడ్డారు.



## ఫిలిప్పీన్స్ లో వేల్పూర్ యువకుడు దుర్మరణం

**వేల్పూర్, విశాల భారతి:** వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన అక్షయ్ అనే యువకుడు ఫిలిప్పీన్స్ లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అక్షయ్ ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ చదవడానికి ఫిలిప్పీన్స్ వెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అక్షయ్ ని రాంగ్ రూట్లో వచ్చి మరో వాహనం ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో అక్షయ్ తో పాటు ఇంకెవరైనా గాయాల పాలయ్యారా అన్నది వివరాలు తెలియ రాలేదు. మరో ఆరు నెలల్లో డాక్టర్ పట్టా పుచ్చుకుంటున్న సమయంలో తమ కుమారుడు మృతి చెందడం వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.



## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**బాల్కొండ, విశాల భారతి :** వైద్య ఖర్చులు భరించలేక పేదలకు రాష్ట్ర ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ ఫండ్ అందించి అండగా నిలుస్తుందని భీమగల్ మండలం ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి రాములు నాయక్ అన్నారు. మండలంలోని దేవన్ పల్లి గ్రామానికి చెందిన వేంకటేష్ కు సిఎం సహాయ నిది నుండి రూ.36 వేలు మంజూరు అయ్యాయి. మంజూరైన చెక్కును కాంగ్రెస్ నాయకులు లబ్దిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా వేంకటేష్ సిఎం రేవంత్ రెడ్డికి, సహాకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, ధర్మింగ్, బొడ్డు గంగారాం, గంగాధర్, సంతోష్, సుమన్, గంగాధర్,నరేష్,పరమేశ్వర,రమేష్,బుచ్చన్న,రమేష్ పాల్గొన్నారు.

## లడ్డూలో జంతువుల కొవ్వు నిజమే

**మొదటిపేజీ తరువాయి**

నాసిరకం నెయ్యి లడ్డూ, ఇతర ప్రసాదాలకు వినియోగించారని స్పష్టం చేశారు. త్వరలోనే టీటీడీలో పదార్థాల పరిశీలనకు అధునాతన ల్యాబ్ ని ఏర్పాటు చేస్తామని ఈవో శ్యామలరావు తెలిపారు.

**నాసిరకం నెయ్యిని సరఫరా చేశారు..**

టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. 'నెయ్యి లాంటి పదార్థాలు కల్తీ చేశారా లేదా అని టెస్టులు చేసేందుకు ఓ ల్యాబ్ కచ్చితంగా కావాలి. రూ.75 లక్షలు ఖర్చు అవుతుంది. మన సొంత ల్యాబ్ ఉంటే నెయ్యి కల్తీ జరగకపోయేది. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయి. నెయ్యి క్వాలిటీ బాగాలేదని ఫీడ్ బ్యాక్ వస్తోంది. సరఫరాదారులకు ఇదివరకే మేం వార్నింగ్ ఇచ్చాం. తమిళనాడుకు చెందిన ఏఆర్ డైరీ ఫుడ్ లిమిటెడ్ మార్చి 12, 2024న టెండర్ కు పిలిచాం. మే నెలలో ఫైనల్ చేశారు. రూ.319కి కాంట్రాక్ట్ ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. టెండర్ దారుడు సప్లై చేసే ధరకు నెయ్యి ఎవరు సప్లై చేయరని నిపుణులు చెప్పారు. అంటే తక్కువ ధరకి నాసిరకమైన నెయ్యిని సప్లై చేశారు. ఐఎస్ఓ స్టాండర్డ్స్ ప్రకారం ఎస్ వాల్యు టెస్టులు ఒకటి. 39 రకాల టెస్టులు చేయడం మరో పరీక్షలు జరపాలి. ఎస్ వాల్యు టెస్టులో 5 రకాల టెస్టులు.. ఓవరాల్ క్వాలిటి ఎలా ఉందనేది పరీక్షిస్తారు. 98.6 నుంచి 104గా ఫ్యాట్ ఉండాలి. కానీ పరీక్షల్లో 20.3 వచ్చిందంటే ఎంత కల్తీ జరిగిందో అర్థమవుతుంది.

**4 ట్యాంకర్లలో కల్తీ నెయ్యి గుర్తించాం..**

తీవ్రమైన ఆరోపణలు రావడంతో.. ఇక్కడ నాణ్యమైన ల్యాబ్ లేని కారణంగా.. తొలిసారి టీటీడీలో కాకుండా బయట ల్యాబ్ కు శాంపిల్స్ పంపించి పరీక్షలు చేయించాం. నాలుగు ట్యాంకర్లలో నెయ్యి క్వాలిటీ లేదని గుర్తించి, వెనక్కి పంపించాం. గుజరాత్ లోని ఆనంద్ దగ్గర ఎన్డీడీబీ ల్యాబ్ కు పంపించి పరీక్షలు చేపించాం. వాస్తవానికి ఇక్కడ విదేశాలకు పంపించే పదార్థాలను పరీక్షిస్తుంటారు. అయితే నాణ్యత లేదని పరీక్షల్లో తేలిన తరువాత సరఫరాదారులను హెచ్చరించగా.. నెయ్యి నాణ్యత పెంచారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించే సమయంలోనే లడ్డూ నాణ్యత పెంచాలని సీఎం నన్ను ఆదేశించారు' మీడియాతో మాట్లాడుతూ తెలిపారు.

**కల్తీ నెయ్యి వాడి ప్రజల మనోభావాలు దెబ్బతీశారు**
**- ఏపీ సీఎం చంద్రబాబు**

తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి వాడి ప్రజల మనోభావాలు దెబ్బతీశారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యితో ఇష్టానుసారం క్షమించరాని నేరం చేస్తే వదిలిపెట్టాలా అని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. గత పాలకులు తిరుమల పవిత్రతను దెబ్బ తీశారని ధ్వజమెత్తారు. లడ్డూ ప్రసాదానికి నాసిరకం నెయ్యి వాడారని మరోసారి స్పష్టం చేశారు. రూ.320కే తక్కువ ధరకు వస్తుందని కల్తీ నెయ్యి వాడారని విమర్శించారు. కల్తీ నెయ్యితో దేవుడికి నైవేద్యం పెడతారా అంటూ నిలదీశారు. తాను తప్పు చేయలేదు టెండర్ పిలిచానని జగన్ చెబుతున్నారని, రూ.320కే కిలో నెయ్యి వస్తుందంటే ప్రభుత్వం ఆలోచించవద్దా అంటూ ప్రశ్నించారు.

**లడ్డూలో జంతువుల కొవ్వును వినియోగించడం నీచం**
**- కేంద్రమంత్రి బండి సంజయ్**

తిరుమల లడ్డూ కల్తీ అంశం హిందువుల మనోభావాలను కలిచి వేస్తుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతున్నా, గతంలో పట్టించుకోలేదని పేర్కొన్నారు. లడ్డూలో జంతువుల కొవ్వును వినియోగించడం నీచమని మండిపడ్డారు. హిందూ ధర్మంపై దాడికి భారీ కుట్ర జరిగినట్లే భావిస్తున్నానని ఆయన వివరించారు. ఈ మేరకు కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేస్తూ ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'లడ్డూ తయారీ నెయ్యి కల్తీ చేసి క్షమించరాని నేరం చేశారు. అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. సీబీఐతో విచారణ జరిపిస్తే వాస్తవాలు నిగ్గుతేలుతాయి. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి.' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏపీ సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల నేతలు లడ్డూ కల్తీ అంశంపై స్పందించారు.



## గ్రామలలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని మందోళ్ల గూడెం, సింగరాయచెర్వు గ్రామపంచాయతీ పరిధిలో గల బూత్ నెంబర్ 10,11 బూత్ అధ్యక్షులు సప్పిడి ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కేతపల్లి జనార్ధన్ రెడ్డి, నల్గొండ బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డిలు హాజరై మాట్లాడుతూ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో సభ్యత్వాన్ని తీసుకొని పార్టీకి అండగాఉండాలని కోరారు. "గ్రామ పంచాయతీల అభివృద్దే దేశం యొక్క లక్ష్యమని" తెలిపారు. అనంతరం బిజెపి చౌటుప్పల్ మండల అధ్యక్షులు చినుకని మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోనే సభ్యత్వ నమోదులో చౌటుప్పల్ మండలం అగ్రగామిగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా ప్రజా సమస్యలు తీర్చడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం, జిల్లా కార్యదర్శి బత్తుల జంగయ్య, అధికార ప్రతినిధి కైరంకొండ అశోక్, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగస్వామి, ఉపాధ్యక్షులు డి. వేణు, అశోక్ గౌడ్, ఒబీసీ మోర్చా పి. శ్రీనివాస్, ఎస్సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట కృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు పబ్బతి శేఖర్, ఒబీసీ మోర్చా జిల్లా కోశాధికారి రాధారపు సత్తయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రవి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ గేమ్స్ లో ప్రతిభ కనబరిచిన త్రినిటీ విద్యార్థులు

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు తంగడపల్లి జడ్పీహెచ్ఎస్ లో నిర్వహించిన కబడ్డీ, కోకో, వాలీబాల్ నందు త్రినిటీ విద్యాసంస్థల బాల బాలికలైన అండర్ 14 బాలికల కోకో విభాగంలోఎం.లోహిత ,అండర్ 14 బాలుర విభాగంలో ఎన్.మనీ శ్రీకర్,అండర్ 17 బాలుర కోకో విభాగంలో ఎన్ .చరణ్, పి.వినీల్, అండర్ 14 బాలుర కబడ్డీ విభాగంలో జి కౌశిక్ ,ఎస్ నరసింహ, కే మనోజ్, అండర్ 17 బాలుర విభాగంలో ఎస్ శ్రీహర్ష, జై రజనీకాంత్ లో జిల్లా స్థాయికి ఎంపికైన సందర్భంగా వీరిని త్రినిటీవిద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల,విద్యాసంస్థల చైర్మన్ కెవిబి కృష్ణారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో త్రినిటీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మహేష్, కిరణ్ ,వెంకటేష్, కరుణాకర్, సుమతి ,వినోద ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భూక్య నాయక్ ,జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు భార్గవి, వ్యాయామ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు లింగయ్య, కృష్ణయ్య, సునీత ,శ్రీదేవి పాల్గొన్నారు.

## బీసీల మేలుకొలుపు సభ ఏర్పాటు చేస్తాం

- **అనంతుల రామ్మూర్తి గౌడ్**



**నూతనకల్ విశాలభారతి:** 75 ఏండ్లుగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీసీలకు అన్ని రంగాల్లో తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారే తప్ప ఈ సమాజంలో దేశ సంపదలో హక్కుదారులుగా చూడడం లేదని బిసి విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనంతుల రామ్మూర్తిగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో 60 శాతం జనాభా ఉన్న బీసీలకు ఒక్క ఎమ్మెల్యే ఉండడడం సిగ్గు చేటని,ఒకే ఇంట్లో ఇద్దరిద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండడం ఇది అగ్రకులాల కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమని అన్నారు.చెప్పేది శ్రీరంగా నీతులు, చేసివి దొంగ పనులు అన్నట్లుగా నల్గొండ జిల్లాలో రాజకీయాలు కొనసాగిస్తురాని ఇకైనైన ఈ తెలివి లేని బీసీలు మేలుకోవాలని,ఈ రాజ్యం,ఈ పదవులు,ఈ బడ్జెట్ లో సగం హక్కుదారులము మనం అని తెలుసుకోవాలని రామ్మూర్తిగౌడ్ హితువు పలికారు. ఇకనైనా బీసీలు మేల్కొని చిల్లర డబ్బులకు విలువైన ఓటుని అమ్ముకోవద్దని,ఒక బీసీకి ఒక్కసారి ఏం ఆశించకుండా ఓటు వేసి గెలుపించుకుంటే ఐదు ఏండ్లు నిర్భయంగా ప్రశ్నించి పనులు చేయించుకోవచ్చని,అదే చిల్లరకు ఆశ పడి ఓటు వేస్తే మనం వాళ్లకు భయపడి వాళ్ళు చెప్పినట్లు వినాల్సివస్తుందని,కాబట్టి ఇలాంటి విలువైన అంశాలు గురించి త్వరలో మండల కేంద్రంలో బీసీల మేలుకొలుపు సభ ని నిర్వహిస్తామని దానికి మండలంలో ఉన్న ప్రతి బీసీ బిడ్డ కుల సంఘాలు ,కవులు కళాకారులు,మేధావులు సహకరించాలని బీసీ సమాజానికి విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి పసుల అశోక్ యాదవ్, సాంస్కృతిక విభాగం సెక్రటరీ గుర్రం యాదగిరి గౌడ్, నాయకులు మల్లేష్ చిర్ర శ్రీనాథ్,ఆంజనేయులు,రాజు, లింగయ్య, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయండి

- **ఆదివాసి సంఘాల ఐక్య వేదిక**



**కరకగూడెం, విశాలభారతి:** అదిలాబాద్ జిల్లా జైనూరులో జరిగినటువంటి ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నానికి నిరసనగా శనివారం రోజున ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాడంలో తుడుందెబ్బ పూర్తి మద్దతు ఇస్తుందని తుడుందెబ్బ నాయకులు సుతారి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బంద్ కార్యక్రమంలో భాగంగా తుడుందెబ్బ అనుబంధం సంఘాలైన మహిళ విద్యార్థి , రైతు ఆదివాసీ కార్మిక కార్యకర్తలు, ఆదివాసి కుటుంబ సభ్యులందరూ మీ మీ ప్రాంతంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నత్త నడకన కాలువ పూడ్చివేత పనులు

- **బిఆర్ఏస్ పార్టీ రాష్ట్ర నాయకులు పెరుమాల్ల సతీష్.**

**పాలకీడు, విశాలభారతి:** నడిగూడెం మండలం రామచంద్రాపురం గ్రామంలో సెప్టెంబర్ ఒకటో తేదీ సాగర్ ఎడమ కాలువకు పడిన గండిని పూడ్చే పనులు నత్త నడకన జరుగుతున్నాయని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పెరుమాల్ల సతీష్ అన్నారు. గండి పడిన ప్రదేశాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. గండి పడి నేటికీ 20 రోజులు అవుతున్నా ఐదు రోజుల క్రితమే పనులు ప్రారంభం కావడం చాలా బాధాకరమని, సాగర్ కాలవను నమ్ముకుని రైతులు వేల ఎకరాలలో పంటలు వేశారని ఇప్పుడు ఆ పంటలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. సాగర్ ఎడమ కాలువకు గండి పడడం ఈరోజు ఏమి కొత్త కాదని ఇంతకుముందు కూడా గండి పడిందని కానీ ఇంత నిర్లక్ష్యం ఎప్పుడు జరగలేదని బాధను వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా జిల్లా మంత్రి కాలువ పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశాడు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- **ఎన్ పి ఆర్ డీ**



**కల్వకుర్తి విశాల భారతి** ఎన్నికల్లో కాంగ్రెస్ వికలాంగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు కోట్ల గౌతమ్ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఎన్.పి.ఆర్.డి వికలాంగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోట్ల గౌతమ్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్న ఇంతవరకు హామీల అమలుపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని అన్నారు. వికలాంగులకు రూ.6వేలు పెన్షన్, పురుష వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ, అదేవిధంగా 2016 వికలాంగుల రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న ప్రకటించిన చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహకాలలో వికలాంగులకు వాటా కల్పించలేదని తెలిపారు. 2016 వికలాంగుల రక్షణ చట్టం ప్రకారం 5శాతం వాటా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ గురువారం ప్రకటించిన చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహక పాలసీలో ఈ అంశం చేర్చలేదని అన్నారు. రాష్ట్రంలో 45 లక్షల మంది వికలాంగులు ఉంటే కేవలం 5 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేకపోతే తీవ్ర ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. వచ్చే నెలలో హైదరాబాద్ లో ఎన్.పి.ఆర్.డి. వికలాంగుల సంఘం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు జరుగుతున్నాయని, ఈ సమావేశాలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో వికలాంగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సాయిబాబు, రామ్ రెడ్డి పాల్గొన్నారు.



## బూడిదపల్లి అంగన్ వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం

**సైదాపూర్ విశాల భారతి** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లోని బూడిదపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త బూడిద రమదేవి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు జన్మదిన వేడుకలు, ఆక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి సేవలను గర్భిణీలు బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజీవ్,ఏఎన్ఎం రాజేశ్వరి,ఆశా కార్యకర్తలు పెరుమాండ్ల మానస,వీరగోని స్వప్న గర్భిణీలు,పిల్లల తల్లులు పాల్గొన్నారు.



## విమలక్కను సన్మానించిన ఉప్పల వెంకటేష్

**కల్వకుర్తి విశాల భారతి** హైదరాబాద్ లోని ఉప్పల వెంకటేష్ ఎస్ వీ కార్యాలయంలో అరుణోదయ ఉద్యమకారిణి, పోరాట వనిత, ప్రజా సమస్యల పైన తన గళాన్ని బలహీన వర్గాల కోసం నిరంతరం ఉత్తేజ పరుస్తూ.. తన గానంతో, తమ కళాబృందంతో పోరాటం కొనసాగిస్తున్న విప్లవకారిణి విమలక్కను శుక్రవారం మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ వెంకటేష్ మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల సర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, బిఆర్ఎస్ నాయకుడు సిద్ధగోని నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటిద్దా

- **టీ మణి రామ్ సింగ్**

**బెల్లంపల్లి, విశాల భారతి** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 4లేబర్ కోడ్లు రద్దు చేయాలని నిరసిస్తూ ఈనెల 23న బ్లాక్ డే పాటిద్దామని టిఎన్టియుసి, నాయకులు పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు మని రామ్ సింగ్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో 4లేబర్ కోడ్లు తెచ్చి కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాల రాస్తోందన్నారు. విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు కొమ్ము కాసిందన్నారు. 23న 4లేబర్ కోడ్ పత్రాలను దగ్ధం చేయాలన్నారు. అదేవిధంగా కార్మికులు, జేఏసీ నాయకులతో కలిసి టిఎన్టియుసి నాయకులు హైదరాబాద్ లోని శివ టెంపుల్ రోడ్ లో గల సెంట్రల్ లేబర్ కమిషనర్ ఆఫీసుల వద్ద జరిగే మహాధర్నకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, జీవరత్నం రమేష్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఆర్ఓబీలు మంజూరు చేయండి

- **రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కోరిన ఎంపి అర్వింద్**



**బాల్కొండ, విశాల భారతి:** పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం నడుస్తున్న ఆర్వోబీల నిర్మాణాలను వేగవంతం చేసేలా అధికారులకు తగు సూచనలు జారీ చేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవిని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కోరారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. పార్లమెంట్ పరిధిలో రైల్వేలకి సంబంధించి పెండింగ్ లో ఉన్న పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారానికి ఒకసారి నడిచే కాజీపేట్ నుండి దాదర్ రైలుని అత్యంత త్వరగా నడిపి, వారానికి మూడుసార్లు నడిచేలా చేయాలని కోరారు. అతి కొద్ది రోజుల్లో రైలు నడిచేలా తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో అవసరమైన చోట్ల కొత్త ఆర్ఓబీలు,ఆర్ యూబీల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని,దేశ రాజధాని ఢిల్లీకి నిజామాబాద్ మీదుగా రైలు సర్వీస్ ని నడపాలని, పార్లమెంట్ పరిధి మీదుగా తిరుపతి, ముంబైలకు కొత్త రైళ్లను నడపాలని కోరారు. అంతే కాకుండా గత రాష్ట్ర ప్రభుత్వాల జాప్యం కారణంగా దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆర్మూర్ నుండి ఆదిలాబాద్, బోధన్ నుండి బీదర్ రైల్వే లైన్ల మంజూరు చర్యలను వేగవంతం చేయాలని ఎంపీ అర్వింద్ కోరారు. అమృత్ భారత్ కింద 53 కోట్లతో చేపడుతున్న నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు.ఇవే కాకుండా పార్లమెంట్ పరిధిలో రైల్వేల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ పేర్కొన్నారు. తాను చేసిన విజ్ఞప్తుల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించి,తగు చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు మంత్రి వివరించారని, దానికి వారికి ధన్యవాదములు తెలియజేస్తున్నానని ఎంపీ అర్వింద్ అన్నారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

- **ఇన్స్పెక్టర్ జగదీశ్**



**ఆమనగల్లు, విశాలభారతి** జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల మండల ఇన్స్పెక్టర్ ఐ జగదీశ్ అన్నారు. ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు అమనగల్లు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. పలు రకాల పాత కేసులను పరిష్కరించుకోనేందుకు ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వివిధ ఘర్షణల్లో కేసులు నమోదు చేసుకున్నవి, క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, భూ తగాద కేసులు, యాక్సిడెంట్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు,చిన్న చిన్న దొంగతనాల కేసులు,ఇంతవరకు పరిష్కారం కానీ ఇతర కేసులను సైతం రాజీ చేసుకునేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. ఎవరూ ప్రతీకారాలకు పోకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. స్నేహభావంతో మెలగడానికి ఈ లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ లోక్ అదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశం ఉందని ఇన్స్పెక్టర్ జగదీశ్ తెలిపారు.



## యువత స్వయం ఉపాధి ఎంచుకోవాలి

**టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు, విశాల భారతి:** కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవస్థానం సమీపంలో ప్రవీణ్ నాయక్,విక్రమ్ నాయక్,కృష్ణనాయక్, గన్ శంకర్ నాయక్ ఏర్పాటు చేసిన స్నేహ చికెన్ సెంటర్ ను టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యువత ఒకరి మీద ఆధారపకుండా తమకు నచ్చిన స్వయం ఉపాధి వైపు వెళ్లాలని,ప్రభుత్వం యువతకు పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్య పరంగా వచ్చే రాయితీలు, సబ్సిడీలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ నేనావత్ భీక్య నాయక్, హీరాసింగ్ నాయక్, అమృ నాయక్, రాందాస్ నాయక్, తులసిరాం నాయక్, కిషన్ నాయక్, రమేష్ నాయక్, శివ్లా నాయక్ శ్రీను నాయక్, రాజా నాయక్, సుధీర్ నాయక్ పాల్గొన్నారు.



## వరద బాధితులకు అండగా నిలవడం అభినందనీయం

- **విద్యార్థులు చిన్ననాటి నుంచి సామాజిక సేవను అలవర్చుకోవాలి**
- **మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల**

**కోదాడ, విశాలభారతి:** విద్యార్థులు చిన్ననాటి నుంచి సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకొని భవితరాలకు ఆదర్శంగా నిలవాలని కోదాడ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ లో వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు సేకరించిన 20వేల రూపాయల విరాళాలతోటి పట్టణంలోని 13వ వార్డు చెరువు కట్టకింద గల లోతట్టు ప్రాంత వరద బాధిత పేదలకు బియ్యంతో పాటు 14 రకాల నిత్యవసరాల సరుకులను పంపిణీ చేసి మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే సామాజిక సేవా దృక్పథం, మానవతా విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు బాల్యం నుంచి సహాయ గుణాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, డివిజన్ విద్యాధికారి సలీం షరీఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్ లంకెల రమ నిరంజన్ రెడ్డి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మార్కండేయ, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య,ఖాజా, బడుగుల సైదులు, రామకృష్ణ, జానకి రామ్, ముక్తార్, పాండురంగ చారి, వేణు కుమార్, చిన్నప్ప, మీనాక్షి, పద్మావతి, కరుణ, రాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల

**ఆలేరు, విశాలభారతి :** యాదగిగుట్టలోని ప్రభుత్వ విప్ కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి బొమ్మలరామారం యాదగిరిగుట్ట రాజాపేట మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కళ్యాణ లక్ష్మి చెక్కులను ,మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందించే 500లకే గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారం మండలంలో 17 చెక్కులను,తుర్కపల్లి మండలంలో 28 చెక్కులను, రాజపేట మండలంలో 29 చెక్కులను, యాదగిరిగుట్ట మండలంలో 34 చెక్కులను అందజేయగా మొత్తం కలిపి 108 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కానుగు బాలరాజు గౌడ్, గుండ్ల పల్లి భారత్ గౌడ్, సుధా హెమెందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

- ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులు భర్తీ చేయాలి
- హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి
- బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ



కోదాడ, విశాల భారతి: పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్ మెంట్ లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడ పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రూ. 4,500 కోట్ల ఫీజు బకాయలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్కాలర్షిప్లు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, పై చదువుల కొరకు కాలేజీ యాజమాన్యాల దగ్గరికి సర్టిఫికెట్ కోసం వెళ్తే, ఫీజు రియంబర్స్మెంట్ రాలేదు డబ్బులు చెల్లించి తీసుకోవాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్లను చెల్లించకపోవడం మూలంగా విద్యార్థులు పై చదువులు చదవలేక పోతున్నారు అనేక ఇబ్బందులు గురవుతున్నారు పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని వారు అన్నారు. ఇకనైనా ఈ ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేసే విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి, నోటిఫికేషన్ విడుదల చేయాలని, అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచి హాస్టల్కు పక్క భవనాలు కట్టించాలని రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయంలో విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సురగాని పరుశురాం, రాజుల శివతేజ, అమరబోయిన ఉపేందర్, నరేష్, సురేష్, నవీన్ నాయుడు, రాకేష్ ముదిరాజ్, గణేష్ చారి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా పోషణ అభియాన్ మహోత్సవాలు

- చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం
- సిడిపిఓ పారిజాతం

**అనంతగిరి, విశాలభారతి:** చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని సీడీపీవో పారిజాతం అన్నారు.శుక్రవారం స్థానిక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోషణ అభియాన్ మాహోత్సవం ఘనంగా నిర్వహించారు.అంగన్వాడి టీచర్లు వివిధ రకాల పోషకాహార వంటలు తయారుచేసి స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించారు.దీనిలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం,అన్నాప్రాసన నిర్వహించారు. అనంతరం సీడీపీఓ పారిజాతం మాట్లాడుతూ పౌష్టికాహార లోపం లేని పిల్లలను తయారు చేయటమే లక్ష్యంగా అంగన్వాడీ కార్యకర్తలు పనిచేస్తున్నారని వారికి గర్భవతులు,బాలింతలు సహకరించాలని అన్నారు.ప్రతి ఒక్కరు అంగన్వాడి ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భవతులు,బాలింతలు విధిగా పౌష్టికాహారాన్ని తీసుకునే విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని ఆమె అన్నారు.పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు.పిల్లల ఎదుగుదల, శారీరక,మానసిక వికాసం కోసం అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు.లబ్ధిదారులు,తల్లులకు పోషణ విలువలు,అదనపు ఆహార విశిష్టత,తల్లి పాల ఆవశ్యకత, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ సుష్మా, ఏపిఎం లక్ష్మి,సూపర్వైజర్ మంగా,పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ ఫరీద్,అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



## దివిస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని స్వాముల వారి లింగోటం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ వారు 2,97,08 రూపాయల విలువ గల నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్, శాండిల్స్ లను స్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏ లక్ష్మమ్మ గారి చేతుల మీదుగా అందజేశారీ. ప్రధానోపాధ్యాయులు ఎన్, పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం పిల్లల చదువుకు అవసరమైనవి అన్నీ అందించి మరియు ప్రతి సంవత్సరం 10వ తరగతిలో తీర్ణులైన వారు ఫస్ట్ ర్యాంక్, సెకండ్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు స్కాలర్షిప్ లను కూడా ఇవ్వడం జరుగుతుంది. అలాగే ఈ సంవత్సరము కూడా దివిస్ వారు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు ఉపయోగించుకొని బాగా చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురలు కే. ఉమా, జిల్లా లు ఎన్ పురుషోత్తం మరియు అధ్యాపక బృందం, కార్యాలయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు అలాగే దివిస్ అధికారులు బి. గోపి, ఎస్. సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రూ. 37 వేలకు లడ్డు దక్కించుకున్న మాజీ సర్పంచ్

**శాలిగౌరారం,విశాలభారతి:** మండల వ్యాప్తంగా గణేష్ శోభాయాత్ర ను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అడ్లూరు గ్రామంలో 11 రోజులు పూజలు అందుకున్న గణనాధుని నిమజ్జనాన్ని జంగాలవారి కాలనీలో ఘనంగా నిర్వహించారు. గణనాధుని నిమజ్జనంలో భాగంగా జరిగిన లడ్డు వేలం పాటలో మండలంలోనే రికార్డు స్థాయిలో లడ్డును 37 వేలకు మాజీ సర్పంచ్ కడమంచి వెంకటయ్య దక్కించుకున్నారు. అడ్లూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన గణేష్ శోభాయాత్ర లో భాగంగా సందర్భంగా చిన్నారులు, పెద్దలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కోలాటాలతో, డాన్స్ లు,బాణాసంచాలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గణేష్ కమిటీ అధ్యక్షులు వానరాశి నరేందర్ మాట్లాడుతూ దాతల సహకారంతో గణనాధుని ఉత్సవాలు 11 రోజులు ఘనంగా జరుపుకున్నామని, స్వామివారి కృపా,అడ్లూరు గ్రామ ప్రజలపై ఉండాలని, ప్రజలు సుభిక్షంగా జీవనం సాగించాలని ,స్వామివారిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువసేన యూత్ అధ్యక్షులు వానరాశి నరేందర్,ఉపాధ్యక్షులు వేముల ఆంజనేయులు, సలహాదారులు వానరాశి శేషాద్రి,కోశాధికారి కల్లెం రాంబాబు, సభ్యులు సోంబాబు,పకీర్,నవీన్, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించిన ముస్లిం సోదరులు

**మణుగూరు, విశాలభారతి:** మండల కేంద్రం శేషగిరి నగర్ లోని జామే మజీద్ కమిటీ సభ్యులు,మత పెద్దల ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జుమా నమాజ్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం సురక్ష బస్టాండ్ నుండి తెలంగాణ చౌరస్తా, అంబేద్కర్ సెంటర్ జామే మసీద్ వరకు పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని ఆయన చూపిన ప్రవచనాలు ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ ,సహనం, శాంతితో కలిగి జీవించాలన్నారు. ఆయన చూపిన మార్గాలను, ప్రవచనాలను మరవకూడదని పెద్దలు ఈ రోజున మిలాద్ ఉన్ నబీ వేడుకల ద్వారా సందేశము కలిగించడానికే ఈ శాంతి ర్యాలీ అన్నారు. ఈ కార్యక్రమంలో మోయినుద్దీన్, ఇస్మాయిల్ ,జావిద్, ముస్తఫా, సిరాజ్, నూరుద్దీన్, ఖాసిం, ఫజల్, హుస్సేన్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చు

- మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి
- జన వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**మరిపెడ,విశాలభారతి:** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఎల్లంపేట గ్రామంలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో శ్రీసత్య లయన్స్ కంటి హస్పటల్స్ చారిట్రబుల్ ట్రస్టు, ప్రథం ఏడ్యుకేషన్ ఫౌండేషన్ వారి సహకారంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.వర్షాకాలంలో వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్యం కాపాడుకోడానికి కాచి వడపోసిన నీటిని తీసుకోవడం మంచిదని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరిసర ప్రాంతాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఐ స్పెషలిస్ట్ డాక్టర్ లయన్ రెడ్డి నాయక్, మేనేజర్ దారవత్ బాలు నాయక్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మోహన్ నాయక్, అంగోత్ అఖిల్ ఆప్తమాలాజిస్ట్, ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర క్లస్టర్ ఇంచార్జి శ్రీహరి సింగ్, సరిత శ్రీహరి సింగ్, డాక్టర్ లక్ష్మణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, జన వికాస సంస్థ కోఆర్డినేటర్స్ జుజ్జూరి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## మేడిగడ్డ తాండలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం

**ఆమనగల్లు, విశాలభారతి :** ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామ కార్యదర్శి వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ డ్రైడే ఫ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడేలో భాగంగా వర్షాకాలం నేపథ్యంలో దోమల ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటి చుట్టూ పాడు బడిన వస్తువులు, టైర్లు, కూలర్లలో నీటి తొట్టిలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ్ రాథోడ్, శ్రీను నాయక్, లాలు నాయక్, దేవు నాయక్ తదితరులు పాల్గొన్నారు



## మాజీ మంత్రి రెడ్యా నాయక్ మిల్లుపై సివిల్ సప్లై దాడులు

- 24,740 కిండల దాన్యం ఉండాలి కానీ గోదాం ఖాళీగా ఉన్నది

**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట శివారు లో మాజీ మంత్రి రెడ్యా నాయక్ కి చెందినా శ్రీ లక్ష్మి పారాబాయిల్డ్ మిల్లుపై రాష్ట్ర సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించింది.ఈ దాడుల్లో సుమారు 6కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యం మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించలేదని అధికారులు గుర్తించారు. ఓ ఎస్ డి ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ మిల్లు యజమాని పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీస్ వారిని కోరారు. 2022 23 సంవత్సరానికి సంబంధించిన దాన్యం 579. 80కింటాలు . దానికి బియ్యం 42 వేల53.58 బియ్యం మిల్లులో ఉండాలి . అయితే సివిల్ సప్లై కి సప్లై చేసిన బియ్యం, క్వింటాలు 18,217 మిగతాది 26790 వడ్ల బస్తాలు ,మిల్లులో నిల్వ ఉండాలి. కానీ సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించినప్పుడు గోధంలో ఒక్క గింజ కూడా లేదు . ధాన్యానికి సంబంధించిన బత్తాల ఖరీదు 6కోట్ల 49 లక్షల 33,000 రూపాయల ఖరీదు ఉంటుందని ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎం. ప్రభాకర్ ఓ ఎస్ డి ,ఎస్సై జంగయ్య , డి సి ఎస్ ఓ ప్రేమ్ కుమార్, డియం కృష్ణవేణి, ఏ ఎస్ ఓ ప్రభాకర్ , టెక్నికల్ అసిస్టెంట్ శంకరయ్య , మరిపెడ తాసిల్దార్ సైదులు , ఎస్సై సతీష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో మందుబాబుల వీరంగం

**శాలిగౌరారం, విశాలభారతి:** మండలంలోని ఎన్జీ కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల ఎస్సి కాలనీలో మందు బాబులు వీరంగం సృష్టించారు. దర్జాగా ప్రభుత్వ పాఠశాలనే బారుగా మార్చేసి పార్టీ చేసుకున్నారు. సరస్వతి కొలివే ఉండే చోట పాఠశాల ఆవరణలో మద్యం తాగి సీసాలు పగలగొట్టారు. శుక్రవారం ఉదయం పాఠశాల రీ ఓపెన్ చేయడంతో తాగుబోతుల భాగోతం బయటపడింది. పాఠశాలలో తాగుబోతుల ఆగడాల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## మాజీ సర్పంచ్ ఎల్లయ్య మృతి పార్టీకి తీరని లోటు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్

**కల్వకుర్తి విశాల భారతి** మండల పరిధిలోని తుర్కలపల్లి తాజా మాజీ సర్పంచ్ ఎల్లయ్య గురువారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శుక్రవారం తుర్కలపల్లికి వెళ్లి ఎల్లయ్య మృతదేహానికి పూలమాలవేసి వారి కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా ఎల్లయ్య కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని సూచించారు. బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్, బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు వట్టేపు కిషోర్, బీఆర్ఎస్ నాయకులు సిద్దగోని నరేష్ గౌడ్, బుచ్చిబాబు, నాగరాజు, అల్లుడు కృష్ణ, రామకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ వాడకంపై అవగాహన సదస్సు

**పాలకుర్తి, విశాలభారతి:** ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ వాడకంపై శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయంలో పాఠశాల ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వరంగల్ రీజియన్2 సేల్స్ ఆఫీసర్ పృథ్వీరాజ్, షణ్ముఖ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు బుర్ర కుమార్ హాజరై గ్యాస్ వినియోగంపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్థానిక మహిళలు, ఉపాధ్యాయినీలు, సీనియర్ టీచర్ జి.దామోదర్ పాల్గొన్నారు.



## గర్భిణీ స్త్రీలకు అవగాహన సదస్సు

**వాజేడు, విశాలభారతి:** వాజేట్ మండల కేంద్రం చెరుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని రేగుల పాడు అంగనవాడి కేంద్రం వద్ద పోషణ అభియాన్ కార్యక్రమాన్ని సిడిపిఓ నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు తీసుకుంటున్న ఆహారం అలవాట్ల పట్ల అవగాహన కల్పిస్తూ గర్భిణులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని పాలు గుడ్లు ఆకుకూరలు వంటివి క్రమం తప్పకుండా తీసుకోవడం వలన మంచి పోషణ శరీరానికి అందుతుందని ఆరోగ్యంగా ఉంటారని . గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా నలత చెందినట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్య అధికారిని సంప్రదించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ముత్తమ్మ, పల్లె దవఖాన వైద్య అధికారి అజ్మీర నవీన్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్ మనోహర, మరియు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



# మార్కెట్లోకి టాటా 'కర్వ్' కొత్త మోడల్ కారు

**మహబూబాబాద్ ,విశాలభారతి:** ఇండియాలో ఆటో మొబైల్ రంగంలో అగ్రగామిగా ఉన్న టాటా కంపెనీ కొత్త మోడల్ కారు మార్కెట్లోకి వచ్చింది. ఇల్లందు రోడ్డులోని సెలక్ట్ మోటర్స్ షోరూంలో ప్రభుత్వ విప్పు డాక్టర్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, భరత్ చంద్ర రెడ్డి, టాటా మోటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం విజయ కుమార్, సెలెక్ట్ మోటార్స్ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్ రావు, బ్రాంచ్ మేనేజర్ గుగులోత్ సురేష్ లు కొత్త మోడల్ 'కర్వ్' కారును మార్కెట్లోకి విడుదల చేశారు. సెలక్ట్ గ్రూప్ అధినేత ముప్పిడి విజయకుమార్ రెడ్డి కారు ప్రత్యేకతలను వివరించారు. కర్వ్ మోడల్ కారు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ మోడళ్లలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రారంభ ధర రూ.9,99,900, గరిష్ట ధర రూ.18.99 లక్షల వరకు ఉందని వివరించారు. అత్యంత ఆధునిక ఫీచర్స్, భద్రతతో తీర్చిదిద్దారని తెలిపారు. ఎలక్ట్రిక్ కారు ఒక్కసారి చార్జింగ్ చేస్తే 502 నుంచి 585 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చని చెప్పారు.



# మహేశ్వరి కుటుంబానికి అండగా నిలిచి ఎన్నారైలు

**కోదాడ, విశాలభారతి:** మునగాల మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన పగిళ్ల మహేశ్వరి మరణించగా అనాధలైన వారి తమ్ముడు పగిళ్ల సాయి భార్గవ్, నాన్నమ్మకు అండగా మానవతా హృదయంతో అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న గణపవరం గ్రామానికి చెందిన గంధం నాగరాజు యాదవ్ 6000, తంగేళ్లగూడెం గ్రామానికి చెందిన ఎన్నారై దేశగాని ఫణిందర్ గౌడ్ 3000, గణపవరం గ్రామానికి చెందిన హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారి నెమ్మది శ్రీనివాసు 2000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎన్నారైలు గంధం నాగరాజు, దేశగాని ఫణిందర్, నెమ్మది శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ముందుకొచ్చి ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.



# వాగులు దాటిన వైద్యం

- వైద్య అధికారి కారం మధు

**కరకగూడెం, విశాలభారతి:** మండల పరిధిలోని లక్ష్మీపురం, కొమ్ముగూడెం, విశ్వనాథపురం, బట్టుపల్లి గ్రామాలలో వైద్యాధికారి కారం మధు, హెచ్ ఈ ఓ కృష్ణయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.నిత్యం క్లోరినేషన్ బ్లీచింగ్ చెల్లించాలని సిబ్బందిని ఆదేశించారు.సీజనల్ వ్యాధులైనటువంటి మలేరియా ,డెంగ్యూ జబ్బులను నివారించుటకై ప్రజలంతా తమ బాధ్యతగా చైతన్యవంతంతో తమ ఇండ్లలోని గోళాలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిలో తోక పురుగులు (దోమల లార్వా లు) లేకుండా క్లీన్ చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. గ్రామమంతటా డ్రైడ్ యాక్టివిటీస్ (ఆంటీ లార్వల్ ఆపరేషన్), ఫీవర్ సర్వే కండక్ట్ చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల అన్ని రకాల జబ్బులకు రక్త పరీక్షలు నిర్వహించబడతాయని. ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి కారం మధు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, నరసింహ, రమాదేవి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ తదితరులు పాల్గొన్నారు.




# సభ్యత్వ నమోదు పగడ్బందీగా చేపట్టాలి

- మాచన్న నరేందర్ రెడ్డి

**కల్వకుర్తి విశాలభారతి** బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జ్ మాచన్న నరేందర్ రెడ్డి సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గ శక్తి కేంద్ర ఇన్చార్జిలు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శుక్రవారం కల్వకుర్తి పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జ్ మాచన్న నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో యువత స్వచ్ఛందంగా బిజెపిలో చేరుతున్నారని, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆశాభావంతో ప్రజలు స్వచ్ఛందంగా బిజెపిలో సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. నరేంద్ర మోడీ చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులు బిజెపి జిల్లా సభ్యత్వం స్వీకరించాలని కోరారు. పార్టీ సూచన మేరకు ఇంటింటికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి బూతులో రెండు వందల చేయించుటకు శక్తి కేంద్ర ఇన్చార్జిలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సభ్యత్వం నమోదు కన్వీనర్ నీరుకంటి రాఘవేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య కృష్ణ గౌడ్, మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు బోడ నరసింహ, రూరల్ అధ్యక్షుడు సురేందర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**వనపర్తి, విశాల భారతి::** వానాకాలం వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వరి కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సారి సన్న రకం వడ్లకు ప్రభుత్వం ద్వారా క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా ఇస్తున్నందున జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో నవంబర్ మొదటి వారం నుండి కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామ పంచాయతీలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఐ.కే.పి, ప్యాక్స్, మేప్మా వారికి కొనుగోలు కేంద్రాలు కేటాయించాలని సూచించారు. నాణ్యమైన వడ్లు తీసుకోవడంతో పాటు దొడ్డు రకం, సన్న రకం వేరు వేరుగా చేసుకోగలిగే విధంగా కొనుగోలు కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి మండల రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో వడ్ల నుండి చెత్త, తాలు వేరు చేసేవిధంగా ఫ్యాన్ ఏర్పాటు చేసుకోవాలని అదేవిధంగా వరి రకం పరిశీలించేందుకు మైక్రో మీటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ శాఖ దగ్గర ఉన్న తూకం యంత్రాలను తూనికలు కొలతల శాఖ అధికారి ద్వారా తనిఖీ చేయించి ధృవీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు. తేమ కొలిచే యంత్రాలను సైతం తనిఖీ చేయించి అవి సరిగ్గా పని చేస్తున్నాయా లేవా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మేరకు గన్ని బ్యాగులు, తాడ్పాలిన్ లు సమకూర్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం. సివిల్ సప్లై ఇర్ఫాన్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ పూర్ణా చందర్, తూనికలు కొలతల అధికారి పాల్గొన్నారు.

# అక్టోబర్ ఒకటి నుంచి మహిళా వసతి గృహం వినియోగంలోకి తేవాలి



**వనపర్తి, విశాల భారతి::** మెడికల్ కళాశాల బాలికల వసతి గృహ భవనాన్ని అక్టోబర్ ఒకటి వరకు పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం మర్రికుంట శివారులో నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అక్టోబర్ నెలలో విద్యార్థులు రాబోతున్నందున ఒకటో తేది నాటికి బాలికల వసతి గృహం భవనాన్ని సకల సౌకర్యాలతో కూడినది అప్పగించాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పనులు దాదాపు పూర్తి అయ్యాయని, ఫ్యాన్లు, ప్లంబింగ్ పనులు నడుస్తున్నాయని గడువు లోపల వసతి గృహం వరకు అప్పగిస్తామని, తరగతి గదులు, మిగతా భవనాన్ని డిసెంబర్ చివరి నాటికి అపియాగించే విధంగా పనులు చేపడతామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. అంతకుముందు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనక భాగంలో ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించారు.వసతి గృహ భవనానికి అవసరమైన మరమ్మతులు త్వరగా పూర్తి చేసి ఇవ్వాలని రోడ్లు భవనాలు శాఖ డి.ఈ ను ఆదేశించారు. భవనం మరమ్మతులు పూర్తి అయితే భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావచ్చని తెలిపారు. వసతి గృహం ముందు భాగం, పరిసర ప్రాంతం అంతా శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్లు భవనాల శాఖ డి.ఈ సీతారామ స్వామి, ఎ. ఈ, వనపర్తి డి.టి. మధు, కాంట్రాక్టరు వెంట ఉన్నారు.



# ఎంసిహెచ్ లో గర్భిణీల అవస్థలపై ఐద్వా సర్వే

- గర్భిణీలకు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు ఇవ్వడం లేదు
- ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

**వనపర్తి, విశాల భారతి::** మాత శిశు సంరక్షణ కేంద్రంలో కొన్ని రోజులుగా గర్భిణీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య స్కానింగ్ లేకపోవడంతో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లో అడ్డగోలుగా డబ్బులు దోచుకుంటున్న ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్లో డబ్బులు ఇవ్వలేక నానా ఇబ్బందులు పడుతున్న గర్భిణీలకు తిప్పలు తప్పట్లేదు అని ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి అన్నారు. శుక్రవారం నర్సింగయపల్లి పరిధిలో ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఐద్వా సంఘం సభ్యులు సర్వే చేపట్టారు. వైద్యుల పర్యవేక్షణ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ప్రతిదీ బయటకు రిఫర్ చేయడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. సిరంజలు, టాబ్లెట్స్, ఎక్కువ మొత్తంలో బయటకు రేఫర్ చేస్తున్నారని ఇలా చేయడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తిగా నమ్మకం పోవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. రేడియాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు మరింత సమస్యలు జఠినమైనట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ , వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి పెట్టి ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని డిమాండ్ చేశారు. సర్వేలో పాల్గొన్న ఐద్వా సభ్యులు సాయి లీల, కవిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.



# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కంప్యూటర్, నోటు పుస్తకాలు పంపిణీ

**కల్వకుర్తి విశాల భారతి** కల్వకుర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముకురాల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, కంబాక్సులు, పెన్సిల్లు, కంప్యూటర్ అందజేశారు. వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ అఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసినట్లు వాసవి క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కంప్యూటర్ దాత ఇరువెంటి రమేష్ కు ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియన్ చైర్మెన్ జూలూరి సత్యనారాయణ, డిస్టిక్ ఆఫీసర్ ఇరువెంటి రమేష్, జోన్ చైర్మన్ కూన సంతోష్, కల్వకుర్తి వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చిదిరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ ఆంజనేయులు, కోశాధికారి దుగ్గి అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# స్వచ్ఛత హి సేవా కార్యక్రమం

**బాల్కొండ, విశాల భారతి** స్వచ్ఛత హి సేవా కార్యక్రమం సందర్భంగా భీమగల్ పట్టణంలోని మూడో వార్డు ప్రజలకు తడి చెత్త,పొడి చెత్త,అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ రామకృష్ణ అవగాహన కల్పించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలందరూ భాగ్యస్వాములు కావాలన్నారు. పట్టణంలోని దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని తెలిపారు. మాంసం వ్యాపారులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.పట్టణ ప్రజలందరూ తడి చెత్త,పొడి చెత్తను మున్సిపల్ చెత్త వాహనంలోనే వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్,వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ మేనేజర్ నరేందర్,వార్డ్ ఆఫీసర్స్ ఇంచార్జ్ రాజేశ్వర్,నవీన్ కుమార్,మాణిక్యం,ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఓంకార్,మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛత మనందరి బాధ్యత

**ఆమనగల్లు, విశాలభారతి :** స్వచ్ఛత మనందరి బాధ్యత అని కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ఆన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరంవిద్యార్థులతో ప్రతిజ్ఞ ' మనందరి బాధ్యత' అంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్వచ్ఛత మనందరి బాధ్యత అని విద్యార్థులకు సూచించారు. దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలన్న సంకల్పంతో ప్రధాని మోది నిర్వయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వసంత, వార్డు ఆఫీసర్ సంతోష, గౌతమి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

**చింతపల్లి విశాల భారతి** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చింతపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో శుక్రవారంతో లడ్డు వేలం పాటలు నిమజ్జన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా ముగిశాయి. గత పది 12 రోజుల నుండి మండలంలోని 34 గ్రామపంచాయతీలలో వాడవాడలా యువకులు ఎంతో ఉత్సాహంతో గణపయ్య విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, భక్తితో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని ఘనంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాంపల్లి సిఐ నవీన్ కుమార్ చింతపల్లి ఎస్ఐబి యాదయ్య వారి సిబ్బంది ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు సభ్యులు గణపయ్యను నిమ్మజన శోభాయాత్ర కు తరలించారు. అందులో భాగంగా చివరి రోజు చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శ్రీ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద లడ్డు వేలం పాట నిర్వహించారు. పెద్ద లడ్డు ను చింతపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం నాయకులు గోవింద్ యాదగిరి 1లక్ష ఒక వెయ్యి 116 లకు దక్కించుకోగా, చిన్న లడ్డును గుండ్లపల్లి వెంకటయ్య 61 వేల రూపాయలకు దక్కించుకోవడం జరిగింది. అదేవిధంగా పైసల దండను అదే కాలనీకి చెందిన చిలకల జ్ఞానేశ్వర్ 26 వేల రూపాయలకు దక్కించుకున్నారు. అనంతరం విగ్రహ దాతకు, అన్న ప్రసాద వితరణ దాతలను ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి

**దేవరుప్పుల, విశాల భారతి** దేవరుప్పుల మండలం, కోలుకొండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఖాసిం ద్వితీయ తనయుడు జాంగిర్ వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్,నాయకులు బస్వ మల్లేశ్,కొల్లూరి సోమయ్య,కోతి ప్రవీణ్,మండల నాయకులు, తదితరులున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
శనివారం,
21.09.2024
హైదరాబాద్




# చిలుకూరి హరిచందనకు పరిశోధనకు జాతీయ అవార్డు

**సికింద్రాబాద్,విశాలభారతి:** ఓయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు డా. సాధం ఐలయ్య గైడెన్స్ లో చిలుకూరి హరి చందన చేసిన బీ.టెక్ ప్రాజెక్టు పరిశోధనకు "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీర్స్ (IICHE) పోటీలో జాతీయ "గుర్తింపు దక్కింది. భారతదేశం అంతటా ఐఐటీ, ఎన్ ఐ టి మరియు దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలతో పోటీ పడిన ఈ బీ.టెక్ "మైక్రో ఛానెల్స్ మ్యాజిక్ అడ్వాన్సింగ్ లిక్విడ్ లిక్విడ్ ఎక్స్‌ట్రాక్షన్ త్రూ ప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్ "అను ఈ పరిశోధన రిపోర్ట్ కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అంబుజాస్ బెస్ట్ హోం పేపర్ ఆఫ్ డిజైన్ ప్రాజెక్టు రిపోర్టు అవార్డు వరించింది.ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ మరియు ఉత్తర్ ప్రదేశ్, అమేథి లోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ RGIPT సంయుక్తము గా నిర్వహించిన 20వ, జాతీయ స్టూడెంట్స్ కెమికల్ ఇంజినీరింగ్ కాంగ్రెస్ SCHEMCON 2024 లో చిలుకూరి హరిచందన "అంబుజాస్ బెస్ట్ డిజైన్ ప్రాజెక్టు రిపోర్టు 2024 అవార్డు " 3వ బహుమతి దక్కించుకున్నారు. ఈ అవార్డుకు సర్టిఫికేట్ తో పాటు రూ .7,000 చెక్ ను స్వీకరించారు. ముఖ్య అతిథి ఉత్తర్ ప్రదేశ్ కేబినెట్ మంత్రి ఎ. కె. శర్మ, అడిషనల్ సోర్సెస్ ఆఫ్ ఎనర్జీ, పద్మ శ్రీ ప్రొఫెసర్ జి. డి. యాదవ్,మాజీ వీసీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, విశిష్ట అతిథి IOCL మాజీ డైరెక్టర్ శుక్లా మిస్త్రీ,ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ జాతీయ అధ్యక్షులు ఠాకర్ సునీల్, వైస్ ప్రెసిడెంట్ శీల, శశికాంత్ పోకలే, నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎ. కె. సిన్హా,RGIPT డైరెక్టర్ ప్రొ. అలోక్ కుమార్ సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కరణ్ మాలిక్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. వి. రమేష్ కుమార్, కెమికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రొ. ఎస్. శ్రీను నాయక్,ప్రొ. వి.వి బసవరావు, డా. సునిత పల్లేటి మరియు కెమికల్ టెక్నాలజీ విభాగపు బోధన, బోధనేతర సిబ్బంది ఆమెను ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



**కూకట్ పల్లి,విశాలభారతి:** జీవితంపై విరక్తి చెంది ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న మహిళ హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పద్మావతి కాలనీ, నాగోల్ ప్రాంతానికి చెందిన ఆకుల సత్యనారాయణ రిటైర్డ్ ఉద్యోగి కూతురు ఆకుల స్నేహ(34) రోడ్ నెంబర్ 3 లోని హాస్టల్లో ఉంటుంది. అయితే స్నేహకు గతంలో రెండు పెళ్లిళ్లు అయ్యి విడిపోవడంతో, గత 17 ఏళ్ల నుంచి చనిపోవాలని ప్రయత్నిస్తున్నానని, జీతం పై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్ లో పేర్కొంది. నా చావుకు ఎవరు కారణం కాదని అందులో రాసింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# కష్టమర్ల అభిరుచికి అనుగుణంగా వ్యాపారం నిర్వహించాలి

**సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** కష్టమర్ల అభిమానం చూరగొన్న ఏ వ్యాపారమైనా మన్నగలుగుతుందని రాష్ట్రసాంఘిక,సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు.శుక్రవారం రాయదుర్గంలో అంతే రెస్టారెంట్ ను ఆమె ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించారు. రెస్టారెంట్ నిర్వాహకులు మంత్రి సీతక్కను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. . ఈసందర్భాగా ఆమె మాట్లాడుతూ..కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు వ్యాపారాన్ని నిర్వాహించి,వారి అభిమానాన్ని పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు రుచిషా, వరుణ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.





# బావ తరంగాలు పుస్తకావిష్కరణ

- ఆవిష్కరించిన సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- బోడుప్పల్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ వాసులు

**బోడుప్పల్,విశాలభారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాలుగో డివిజన్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో నివాసముండే రచయిత మధు మోహన్ ఉదయగిరి రచించిన బావతరంగాల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కవి జాతీయ ఉత్తమ సినిగేయ రచయిత అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ పాల్గొని మధుమోహన్ ఉదయగిరి రచించిన బావ తరంగాలు పుస్తకం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.తన జీవిత అనుభవాలను గుర్తు చేసుకుంటూ గుడిపాటి వెంకటాచలం, సిరివెన్నెల,వేటూరి వంటి వివిధ కవులు జీవితంలో వారు పడిన శ్రమ, వారు రాసిన కవిత్వాలు కథలు సమాజాన్ని ఎంతగానో ప్రతిబింబ చేశాయని అన్నారు.అలాగే ఈ పుస్తకం హృదయాన్ని మలుచుకునే విధంగా ఉందని అన్నారు.ఈ పుస్తకం ధారావాహికంగా ఉండాలని ఆశించారు.రచయిత మధుమోహన్ ఉదయగిరి మరిన్ని కవితలు పాటలు రాయాలని ఆకాంక్షించారు. అనంతరం పుస్తక రచయిత మధుమోహన్ ఉదయగిరి మాట్లాడుతూ. సమాజంలో ఉన్న రుగ్మతులు అసమానతలు గురించి ఎక్కువగా రాశానని, వాస్తవిక జీవిత అనుభవాలు, జీవితంలో తాను అనుభవించిన సంఘటనలు, ఉద్యమాలలో జరిగిన సంఘటనలు పుస్తకంలో రాశానని అన్నారు,ఈ సమాజానికి ఎంత ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేసిన సుద్దాల అశోక్ తేజ మరియు కాలనీవాసులకు,ఈ పుస్తకం రాసేందుకు ప్రోత్సహించిన మిత్రులకు శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ మధుమోహన్ ఉదయగిరి మరిన్ని కవితలు పాటలు రాయాలని ఆకాంక్షించారు.

# సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది

**కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**



**కూకట్ పల్లి,విశాలభారతి :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అంటూ గొప్పలు చెప్పుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్లయినా వాళ్లకు సంబంధిత చెక్కులు ఇవ్వకపోవడం శోచనీయమని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ధ్వజమెత్తారు. మూడేళ్లుగా పెండింగ్లో ఉన్న4వందల మంది కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన శుక్రవారం కూకట్పల్లి మండల కార్యాలయంలో లబ్ధిదారులకు స్థానిక నాయకులు అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పథకాలు అందేలా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు పథకాల అమలులో ప్రోటోకాల్ అంటూ అధికారులను బెదిరిస్తున్నారని అలాంటి వ్యక్తులకు అధికారులు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదన్నారు.ప్రజాప్రయోజన పథకాల అమలును తాము దగ్గర ఉండి అమలయ్యేలా చూస్తామన్నారు. కల్యాణ లక్ష్మి చెక్కులు ఇవ్వడానికి సైతం కొందరు బిఆర్ఎస్ నాయకులు కమిషన్లు అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎవరికి ఒక పైసా ఇచ్చే అవసరం లేదని రమేశ్ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్, మేకల రమేష్, ప్రవీణ్ ,కృష్ణా రాజ్ పుత్ ,మధు గౌడ్, సతీష్ గౌడ్, మరియు శివ చౌదరి, బచ్చు మల్లీ, మాధురి రాము, నరసింహ, జ్యోతి వనజ ,సంధ్య తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం

**భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**పటాన్ చెరు,విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని భారతీ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో సేల్స్ ఫోర్స్ బిజినెస్ టెక్నాలజీ మరియు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సహకారంతో సుమారు 13 లక్షతో అంగన్వాడి మరియు ఎంపీపీఎస్ స్కూల్లో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. శక్రవారం ఆయా సంస్థల ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ప్రారంభించారు. గతంలో ఈ సంస్థ నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, బ్యాగులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల మరమత్తులు చేయాలని కార్పొరేటర్ సింధు వారిని కోరగా, మరమత్తు పనులకు ఆ సంస్థ ప్రతినిధి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం స్కూల్ కిచెన్, అంగన్వాడి కేంద్రానికి స్టోర్ రూం, స్లాబ్ ఫ్లోరింగ్ చేయించి టేబుల్స్, బీరువా, కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. పాఠశాల, అంగన్వాడి పునర్నిర్మాణ పనులు చేపట్టినందుకు సేల్స్ ఫోర్స్ బిజినెస్ టెక్నాలజీ సంస్థకు అభినందించారు. డిప్యూటీ కమిషనర్ సురేష్, సేల్స్ ఫోర్స్ టీం సుదీప్, అభినేష్, పాండు, స్వప్న, శిరీష మరియు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సిబ్బంది నరేష్, చంద్రకాంత్ హెడ్ మాస్టర్ జయశ్రీ, టీచర్ రజిత, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, టీచర్ పద్మ, నరసమ్మ, సర్కిల్ యూత్ అధ్యక్షుడు నరసింహ, మహిళా నాయకురాలు రాణీ యాదవ్, డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు అజీముద్దీన్, సర్కిల్ మైనార్టీ సెక్రెటరీ గౌస్, సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, ఎల్ఐజి కాలనీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, శామ్యూల్ జాన్, బి.డి.ఎల్ డైరెక్టర్ విట్టల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు దేవేంద్ర చారీ, వెంకట్ రెడ్డి, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.



# రాజీవ్ ఆరోగ్యశ్రీ EKYC కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలోని ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిపొందే వారి కోసం వైద్య సేవల పరిమితిని రూ.5లక్షల నుంచి10 లక్షలకు పెంచిందన్నారు. ఇందుకు సంబంధించిన కెవైసి ప్రక్రియను పూర్తి చేయడానికి డివిజన్ పరిధిలోని పిజెఆర్ నగర్ మొగులమ్మ కాలనీ లో ఏర్పాటుచేసిన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డ్ EKYC నమోదు కేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సందర్శించి కెవైసి ప్రక్రియను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం పరిమితిని అయిదు నించి పది లక్షలకు పెంచి, పూర్తి ఉచితంగా పది లక్షల రూపాయల వరకు కుటుంబం మొత్తానికి ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే వీలు కల్పించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.అర్హులైన పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం ఎంతో మంది పేదలకు ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేష్, జి.రవి, భాస్కర్, పోశెట్టిగౌడ్, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, మౌలానా, మహేష్, శామ్యూల్, రవీందర్, మీసాల జనయ్య, పుట్టం దేవి, సరిత, తదితరులు పాల్గొన్నారు.



# టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ కు అభినందనలు

**బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్**

**సికింద్రాబాద్,విశాలభారతి:** టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను తన నివాసంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ , మహేష్ కుమార్ గౌడ్ ని శుక్రవారం కలసి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం చాలా సంతోషకరమని విషయమని అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అన్ని కులాల సమగ్ర కుల గణన జరిపించి, కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేసి కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవలసిన సమయం ఆసన్నమైందని మహేష్ కుమార్ గౌడ్ ని, బొల్లెపల్లి స్వామి గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండ ఏడుకొండలు, శ్రీకాంత్, మహేష్,లాలు, ఆంజనేయులు పాల్గొన్నారు.



# తులం బంగారన్ని ఇస్తామని హామీ ఎం అయింది

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్పల్లి నియోజకవర్గం కెపిహెచ్ బి ఎం.ఆర్.ఓ. కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్ పల్లి నియోజకవర్గ కార్పోరేటర్లు సబేహ గౌసుద్దీన్ , జూపల్లి సత్యనారాయణ, శిరీష బాబురావు, ఎమ్మార్వో స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం సుమారుగా 210 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లి ఖర్చుల నిమిత్తం కేసీఆర్ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనటువంటి విదంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకొరకు ప్రవేశపెట్టిన పథకం అని, ప్రస్తుత ముఖ్యమంత్రి కల్యాణ లక్ష్మి షాదిముబారక్ తో పాటు తులం బంగారంన్ని ఇస్తామని హామీ ఇచ్చినందుకు చాల సంతోషకరమని, కానీ ఇంత వరకు కూడా ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు, అలాగే చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఇచ్చేవిదంగా కలెక్టర్ ఎమ్మెర్వో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ప్రేమ విఫలం కావడంతో యువకుడి ఆత్మహత్య




**కూకట్ పల్లి,విశాలభారతి:** ప్రేమ విఫలమైందని ప్రేమించిన అమ్మాయి నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి లోనై ఫ్యాన్ కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్అమీర్లో చోటుచేసుకుంది. కూకట్పల్లి పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. సాయి గణేష్(24) అరుణ్ తో కలిసి ఉప్పల్లోని సీసీ కెమెరాల ఆఫీసులో పనిచేస్తున్నాడు. అయితే సాయి ఓ అమ్మాయిని గత కొన్నిఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇదిలా ఉండగా సాయి ప్రవర్తనలో మార్పులు రావడం ఆ యువతి పట్ల అనుమానం పెంచుకోవడంతో ఆ యువతి ప్రేమను నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.



# ఘనంగా బీసీ కాలనీ గణనాథుని నిమజ్జనం

**చింతపల్లి, విశాల భారతి:** గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమంలో సాంప్రదాయ వస్త్రాలు( ఏకరూప దుస్తుల) తో మహిళలు, యువకులు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు, కోలాటం, సాంస్కృతి కార్యక్రమాలు, డిజె సౌండ్ సిస్టంతో డాన్సులు చేస్తూ అలరించారు. మరోవైపు డప్పు వాయిద్యాలతో వివిధ కళారూపాల వేషధారణలతో జానపద నృత్యాలు చేసి నిమజ్జన యాత్రలో గ్రామ ప్రజలకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి మాజీ ఎంపీపీ సదానందం, మాజీ ఉప సర్పంచ్ సలీం, కో ఆప్షన్ జహంగీర్, గోవింద్ యాదగిరి, మధు, కొండాపురం రవి, కోటేష్, గజ్జఅభినవ్, గజ్జ శీను, గోవింద్ శివ, లష్కర్ సురేష్, కొప్పుల శ్రీనాథ్, బోడ వెంకటయ్య, గూడెల్లి రాజేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# గౌడ సంఘం అధ్యక్షుడిగా అనగోని రవీందర్ గౌడ్ ఎన్నిక

**సైదాపూర్, విశాల భారతి:** సైదాపూర్ మండల కేంద్రంలో సైదాపూర్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులుగా అనగొని రవీందర్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గౌడ సంఘం సభ్యులందరూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా కొండ మల్లయ్య గౌడ్,పాలకవర్గం సభ్యులుగా బత్తిని బిక్షపతి గౌడ్, అనగోని తిరుపతి గౌడ్,సుదర్శన్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, ప్రణయ్ గౌడ్,శేఖర్ గౌడ్,కోలిపాక తిరుపతి గౌడ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి, గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా

www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily
శనివారం,
21.09.2024
హైదరాబాద్






## 31 సిటీల్లో ANR 100 ఫిల్మ్ ఫెస్టివల్ సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా వుంది


: అక్కినేని నాగార్జున

నటసామ్రాట్, పద్మవిభూషణ్ శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారి శత జయంతి సందర్భంగా, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ NFDCనేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియాతో కలిసి 'ANR 100 – కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' ఫిల్మ్ ఫెస్టివల్ ని నిర్వహిస్తోంది. అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ANR ఐకానిక్ ఫిలిం 'దేవదాసు' స్క్రీనింగ్ తో ఈ ఫెస్టివల్ గ్రాండ్ గా ప్రారంభమైంది. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ లో 'దేవదాసు' (1953), 'మిస్సమ్మ' (1955) 'మాయాబజార్' (1957), 'భార్య భర్తలు' (1961), 'గుండమ్మ కథ' (1962), 'డాక్టర్ చక్రవర్తి' (1964), 'సుడిగుండాలు' (1968), 'ప్రేమ్ నగర్' (1971), 'ప్రేమాభిషేకం' (1981) 'మనం' (2014) సహా ANR ల్యాండ్‌మార్క్ మూవీస్ దేశవ్యాప్తంగా ప్రదర్శించనున్నారు. ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా ఈ 10 మాస్టర్ పీస్ మూవీ ప్రింట్ లను 4Kలో పునరుద్ధరించడానికి చొరవ తీసుకున్నాయి. అద్భుతమైన క్యాలిటీలో ఈ క్లాసిక్స్ ని ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నాన్నగారు నవ్వుతూ మాకు జీవితాన్ని నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుంటే నవ్వుతూనే వుంటాం. శివేంద్ర గారికి థాంక్. దేవదాస్ తో పాటు మరికొన్ని సినిమాలు చూడబోతున్నారు. వాళ్ళు చేసిన బ్లాక్ అండ్ వైట్ ప్రింట్స్ అద్భుతంగా వున్నాయి. ఆడియన్స్ కి వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్ వుంటుంది. 31 సిటీల్లో ఈ ఫెస్టివల్ చేస్తున్నారు. నార్త్ లో ఫాంటాస్టిక్ రెస్పాన్స్ వస్తుందని శివేంద్ర చెప్పడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. గోవా ఇంటర్ నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నాన్న గారి పేరు మీద ఒక చాప్టర్ చేస్తున్నారు. ఈ విషయంలో చాలా హ్యాపీగా వుంది. పోస్ట్ మాస్టర్ జనరల్ బీఎస్ రెడ్డి గారికి థాంక్ యూ. ఈ శత జయంతి రోజున నాన్న గారి స్టాంప్ రిలీజ్ చేయడం చాలా అనందంగా వుంది. ఈ వేడుకకు వచ్చిన అందరికీ పేరుపేరునా థాంక్ యూ సో మచ్. శత జయంతిని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో ని నాన్న గారి సీనియర్ అభిమానులు రక్తదానం, అన్నదానం లాంటి మంచి కార్యక్రమలు చేశారు. వారందరికీ థాంక్ యు వెరీ మచ్. మీ ప్రేమ అభిమానం మర్చిపోలేనేది. ప్రతి రెండేళ్ళకు ఏఎన్ఆర్ అవార్డ్ ఇస్తున్నాం. ఈ ఏడాది ఏఎన్ఆర్ అవార్డ్ చిరంజీవి గారికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈ విషయం చెప్పగానే చిరంజీవి గారు చాలా ఎమోషనల్ హాగ్ చేసుకొని ఏఎన్ఆర్ గారి శత జయంతి ఏడాదిలో ఇవ్వడం చాలా ఆనందంగా వుందని చెప్పారు. దీనికి కంటే పెద్ద అవార్డ్ లేదని అన్నారు. అమితాబ్ బచ్చన్ గారు ఆవార్డ్ ప్రధానం చేస్తారు. అక్టోబర్ 28 ఈ ఫంక్షన్ చేస్తున్నాం. అందరికీ ధన్యవాదాలు' తెలిపారు.

## సెప్టెంబర్ 23 నుంచి 'హరి హర వీర మల్లు'

సినీ రంగంలో తిరుగులేని కథానాయకుడిగా పేరు సంపాదించుకున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయ రంగ ప్రవేశం చేసి, అక్కడా గొప్ప నాయకుడిగా పేరు పొందారు. ప్రజాసేవకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న పవన్ కళ్యాణ్, 'హరి హర వీర మల్లు' చిత్రం యొక్క మిగిలిన షూటింగ్ ను పూర్తి చేయడానికి తగిన సమయం కేటాయించలేకపోయారు. సమాజ సేవ పట్ల పవన్ కళ్యాణ్ నిబద్ధతను అర్థం చేసుకున్న చిత్ర నిర్మాతలు, ఆయన భాగంకాని ఇతర సన్నివేశాల చిత్రీకరణ మరియు చిత్రానికి సంబంధించిన ఇతర కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాల్సిన బాధ్యతపై కూడా తనపై ఉందని, వీలు చూసుకొని షూటింగ్ కోసం తగు సమయం కేటాయిస్తానని మాట ఇచ్చారు. తన మాటకు కట్టుబడి ఉన్న పవన్ కళ్యాణ్, హరి హర వీర మల్లు మొదటి భాగం యొక్క మిగిలిన షూటింగ్ ను పూర్తి చేయడానికి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయనతో కలిసి చేయడానికి నటీనటులు, సాంకేతిక సిబ్బంది ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. వెండితెరపై ప్రేక్షకులకు మరపురాని అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో, నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి విజయవాడలో 'హరి హర వీర మల్లు' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించబోతున్నామని నిర్మాతలు తెలిపారు. 'బ్రేవ్‌హార్ట్', 'గ్లాడియేటర్', 'బోర్న్ ఐడెంటిటీ', 'ది లాస్ట్ సమురాయ్', 'రెసిడెంట్ ఈవిల్: రిట్రిబ్యూషన్' వంటి పలు క్లాసిక్ చిత్రాలకు నిక్ పావెల్ పనిచేశారు. 1986లో సినీ ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆయన, సెకండ్ యూనిట్ డైరెక్టర్‌గా, స్టంట్ కో-ఆర్డినేటర్‌గా, ఫైట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తూ తనదైన ముద్ర వేశారు. ప్రతిష్టాత్మక టారస్ వరల్డ్ స్టంట్ అవార్డులకు ఏకంగా 12 సార్లు నామినేట్ అయిన నిక్ పావెల్, ఐదు అవార్డులను గెలుచుకున్నారు. నిక్ పావెల్ తన అసాధారణ నైపుణ్యంతో 'హరి హర వీర మల్లు' యుద్ధ సన్నివేశాలను అద్భుతంగా తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.





## అందాల బుట్టబొమ్మ గ్లామర్ హొయలు

తెలుగు ప్రేక్షకులకు ఒక లైలా కోసం, ముకుంద సినిమాలతో పరిచయం అయిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. మొదటి రెండు సినిమాలూ బాక్సాఫీస్ వద్ద హిట్ కొట్టలేదు. పైగా ఆ రెండు సినిమాల్లోనూ పూజా హెగ్డే నటనకు, అందానికి, గ్లామర్ కి పెద్దగా మార్కులు పడలేదు. దాంతో ఆ రెండు సినిమాలు టాలీవుడ్ లో ఆమెకు గుర్తింపును తెచ్చి పెట్టలేదు. ఆ రెండు సినిమాల తర్వాత దాదాపు రెండేళ్లు బాలీవుడ్ కి వెళ్లి పోయిన పూజా హెగ్డే రీ ఎంట్రీ లో అల్లు అర్జున్ కి జోడీగా 'డీజే' సినిమాలో నటించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అంతే కాకుండా ఒక్కసారిగా పూజా అందానికి అభిమానులు పెరిగి పోయారు. డీజే సినిమాలో పూజా హెగ్డే చేసిన స్కిన్ షో ఒక్కసారిగా ఆమెను వార్తల్లో నిలపడం జరిగింది. అందాల ముద్దుగుమ్మ అంటూ అభిమానులు పిలుచుకుంటూ బుట్టబొమ్మ అంటూ అందరితో అనిపించుకున్న పూజా హెగ్డే ఈ మధ్య కాలంలో సినిమాల పరంగా కాస్త స్లో అయింది. తిరిగి ఇండస్ట్రీలో బిజీ అవ్వడం కోసం ఈ అమ్మడు ప్రయత్నాలు చేస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే ఈమె సోషల్ మీడియాలో ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవ్వడం కామన్ గా జరుగుతూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ అందాల ఫోటో షూట్స్ ఆకట్టుకుంటున్నాయి. అందమైన పూజా హెగ్డే అందంను మరింత పెంచే విధంగా ఈ ఔట్ ఫిట్ ఉందనే కామెంట్స్ కొందరు చేస్తూ ఉంటే, ఇంతటి అందగత్తెకు ఎందుకు ఆఫర్లు తగ్గాయి, సినిమాల్లో ఎందుకు ఇంత త్వరగా ఫేడ్ ఔట్ అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న పూజా హెగ్డే మళ్లీ ఇండస్ట్రీలో రీ ఎంట్రీ ఇచ్చి బిజీ అవ్వాలని కోరుకుంటున్నట్లుగా ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగు తో పాటు ఇతర భాషల్లోనూ ప్రస్తుతం పూజా హెగ్డే చేస్తున్న సినిమాలు ఏమీ లేవు. ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయనే వార్తలు ఆ మధ్య వచ్చాయి. వచ్చే ఏడాదిలో ఒక హిందీ సినిమా, ఒక తమిళ సినిమాతో ఈమె ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అవి ఎంత వరకు వర్కౌట్ అవుతాయి అనేది క్లారిటీ లేదు. ముందు ముందు సినిమాల్లో పూజా హెగ్డే అందంతో పాటు అభినయంతో అలరించేందుకు గాను ప్రయత్నాలు చేస్తోంది. ఇతర హీరోయిన్స్ మాదిరిగా పూజా హెగ్డే సైతం లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేసేందుకు ఆసక్తిని కనబర్చుతోంది. మరి ఆ ఆఫర్లు అయినా ఈ అమ్మడికి దక్కేనా అనేది చూడాలి.



## 'మ్యాడ్ స్క్వేర్' నుంచి 'లడ్డు గాని పెళ్లి' గీతం విడుదల

కళాశాల నేపథ్యంలో ముగ్గురు యువకులు చేసే అల్లరి ప్రధానంగా రూపొందిన వినోదాత్మక చిత్రం 'మ్యాడ్' ఎంతటి సంచలన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రానికి సీక్వెల్ గా మ్యాడ్ మ్యాక్స్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్ స్క్వేర్'ను తీసుకురాబోతుంది. కేవలం ప్రకటనతోనే 'మ్యాడ్ స్క్వేర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా యువత ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో "లడ్డు గాని పెళ్లి" అనే బరాత్ గీతంతో ప్రచార కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించింది చిత్ర బృందం. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా "లడ్డు గాని పెళ్లి"ని సెప్టెంబర్ 20న విడుదల చేశారు. 'మ్యాడ్' చిత్రంలో భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన "కళ్ళజోడు కాలేజీ పాప" అనే పాట యువతను విశేషంగా ఆకట్టుకొని చార్ట్ బస్టర్ గా నిలిచింది. ఇప్పుడు 'మ్యాడ్ స్క్వేర్' కోసం ఆయన స్వరపరిచిన "లడ్డు గానీ పెళ్లి" గీతం అంతకుమించిన ఆదరణ పొందుతుంది అనడంలో సందేహం లేదు. తీన్మార్ బీట్ లతో థియేటర్లలో ప్రతి ఒక్కరూ కాలు కదిపేలా ఈ గీతం ఉంది.

## అక్టోబర్ 4న సాయి ధన్సిక 'దక్షిణ'



మంత్ర , మంగళ సినిమాలతో తెలుగు చలన చిత్ర రంగంలో లేడీ ఓరియెంటెడ్ మూవీస్‌కి ఒక ట్రెండ్ క్రియేట్ చేసిన డైరెక్టర్ ఓషో తులసిరామ్ మళ్ళీ "దక్షిణ " మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కల్ట్ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మాణంలో అశోక్ షిండే నిర్మాతగా కబాలి ఫేమ్ సాయి ధన్షిక కథనాయాకిగా మహాభారత్ మర్డర్స్ ఫేమ్ రిషవ్ బసు మరొక ముఖ్య పాత్రలో నటించారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్ర గ్లింప్స్, ట్రైలర్‌కు విశేష స్పందన లభించింది, ట్రైలర్‌ను ప్రముఖ దర్శకులు బుచ్చిబాబు విడుదల చేసారు. అక్టోబర్ 4న దక్షిణ చిత్రాన్ని గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నారు. థ్రిల్లింగ్ సినిమాలకు సరికొత్త డెఫినేషన్ ఈ సినిమా ఇవ్వబోతోందని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. మళ్ళీ తులసి రామ్ టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ని దక్షిణ సినిమాతో ఇవ్వబోతున్నారు. నెక్స్ట్ ఏం జరుగుతుంది అనే సస్పెన్స్ ప్రేక్షకుల్లో ఉత్కంఠరేపుతోందని అక్టోబర్ 4న విడుదల కాబోతున్న దక్షణ ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందని, నైజాంలో దక్షిణ సినిమాను మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుందని నిర్మాత అశోక్ షిండే తెలిపారు. ఈ సినిమాలో స్నేహ సింగ్, కరుణ, ఆర్నా ములెర్, మేఘన చౌదరి, నవీన్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయా గ్రహణం రామకృష్ణ (ఆర్.కె)కాగ, సంగీతం బాలాజీ అందిస్తున్నారు.

## ఘనంగా "ఫియర్" టీజర్ రిలీజ్ ఈవెంట్



హీరోయిన్ వేదిక లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమా "ఫియర్". ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్ ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఫియర్ మూవీని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్ లో కనిపించనున్నారు. "ఫియర్" సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్ లో 60 కి పైగా అవార్డ్స్ లను గెల్చుకుని కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. "ఫియర్" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఈ రోజు "ఫియర్" సినిమా తెలుగు టీజర్ ను స్టార్ హీరో రానా, తమిళ టీజర్ ను విజయ్ సేతుపతి, కన్నడ టీజర్ ను కిచ్చా సుదీప్, మలయాళ టీజర్ ను దిలీప్, హిందీ టీజర్ ను ఇమ్రాన్ హాష్మీ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. అనంతరం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో "ఫియర్" టీజర్ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఏఆర్ అభిమాట్లాడుతూ - నాకు కమర్షియల్ సినిమాలు అంటే ఇష్టం. కానీ మా ఆవిడ హరిత సస్పెన్స్ థ్రిల్లర్ కథ చెప్పింది. కథ నాకు బాగా నచ్చింది. ఇంట్లో నన్ను భయపెట్టే ఆవిడ "ఫియర్" సినిమాతో ప్రేక్షకుల్ని కూడా ఈజీగా భయపెడుతుందని నమ్మాను. ఈ సినిమా చూస్తున్నప్పుడు మీకు ముఖ్యంగా నాలుగు విషయాలు గుర్తుంటాయి. ఒకటి వేదిక గారి పర్ ఫార్మెన్స్, రెండు హరిత చేసిన స్క్రిప్ట్, మూడు అనూప్ గారు చేసిన మ్యూజిక్, ఆండ్రూ గారు ఇచ్చిన విజువల్స్ ...ఈ నాలుగు బాగా ఇంప్రెస్ చేస్తాయి. వేదిక గారిని సెలెక్ట్ చేసుకున్నప్పుడే దర్శకురాలిగా హరిత మంచి డెసిషన్ తీసుకుందని అనిపించింది. ఎందుకంటే ఆవిడ బ్యూటిఫుల్ గా ఉండటమే కాదు అద్భుతంగా పర్ ఫార్మ్ చేస్తారు. అరవింద్ కృష్ణ మంచి రోల్ చేశాడు. టీమ్ అంతా మాకు బాగా సపోర్ట్ చేసింది. మా మొదటి సినిమా లక్కీ లక్ష్మణ్ అప్పుడు మీరంతా ఎలా సపోర్ట్ చేశారో ఈ "ఫియర్" సినిమాకు కూడా అలాగే సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ డా. హరిత గోగినేని మాట్లాడుతూ - "ఫియర్" సినిమాలో హీరోయిన్ కోసం ఐదు చెక్ పాయింట్స్ పెట్టుకున్నాను. ఆ ఐదింటికి సరిపోయిన హీరోయిన్ వేదిక గారు. వేదిక పర్ ఫార్మెన్స్ మీ అందరికీ నచ్చుతుంది. అయితే అనూప్ గారి మ్యూజిక్ డైరెక్టర్ గా నన్ను, నటిగా వేదిక గారిని డామినేట్ చేస్తారని చెప్పగలను. మా సినిమాకు ఎన్నో ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్ లో అవార్డ్స్ వచ్చాయి. నేను ఈ విషయం మా బ్రదర్ తో చెబితే ఇందులో ఎన్ని కొన్నారు అని అడిగారు. మా వాళ్లకే అలాంటి డౌట్స్ వచ్చినప్పుడు బయటకు వాళ్లకు రావడంలో ఆశ్చర్యం లేదు. అయితే ఇవన్నీ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్. వాటిలో అలా జరుగుతుందని నేను అనుకోను. ఈ అవార్డ్స్ అన్నీ మా సినిమాకు వచ్చాయనే కంటే ఆ లిస్టులో ఇండియా పేరు చూసినప్పుడు గర్వంగా అనిపించింది. తన జీవితంలో కొన్ని అనుకోని సందర్భాల్లో ఒక అమ్మాయి భయపడితే ఆ పర్యావసనాలు ఎలా ఉంటాయి అనేది ఫియర్ మూవీ కథ. ఈ సినిమాను మీరు థియేటర్ లోనే ఎంజాయ్ చేయాలి. అందుకే ఎక్కువగా రివీల్ చేయడం లేదు. నెక్ట్ మంత్ లో మా సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేస్తాం. ఈ సినిమా థియేటర్ తో పాటు ఓటీటీకి కూడా బాగా సెట్ అవుతుంది. అయితే విజువల్ గా, మ్యూజికల్ గా, స్క్రీన్ ప్లేలోని ఆ సస్పెన్స్ ను ఎంజాయ్ చేయాలంటే థియేటర్ లోనే చూడాలి. మీరంతా మా సినిమాకు సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నాం. అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.